https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

డీకే సారధ్యంలో చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 18 సంచిక : 23 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ మంగళవారం,అక్టోబర్,20, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-



50 డిగ్రీలకు చేరనున్న ఎండలు?

గోదావరి నీటి నిల్వపై మంత్రి తుమ్మల కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్,అక్టోబర్,19:గోదావరి నీళ్లకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాల ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారని చెప్పారు. భద్రాద్రి జిల్లా అమ్మగారిపల్లి వద్ద గోదావరి ఆనకట్టను ఇవాళ మంత్రి తుమ్మల పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక భూగర్భజలాలు అడుగంటాయని, తక్కువ నీటి వినియోగం ఉండే పంటలు సాగు చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. విద్యుత్ ఉత్పత్తి తగ్గడం నీటి కొరత వల్ల రైతులు వరి సాగు చేయొద్దన్నారు. సూపర్ ఎల్ నినో ప్రభావంతో 50 డిగ్రీలు ఎండలు దాటే అవకాశం ఉందని, తాగునీటి కష్టాలు లేకుండా గోదావరి నీళ్లను నిల్వ చేయాలని సీఎంకు వివరించానన్నారు. దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాల ఏర్పాటు పనులు చేయాలని సీఎం ఆదేశించారని అన్నారు.

హైదరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం



హైదరాబాద్, అక్టోబరు 19: తెలంగాణ హైకోర్టు సమీపంలోని మదీనా వద్ద ఉన్న ‘బాంబే హోజరీ’లో భారీ అగ్నిప్రమాదం జరిగింది.సోమవారం తెల్లవారుజామున, హైకోర్టుకు ఎదురుగా ఉన్న మదీనా క్రాస్ రోడ్ వద్ద గల ‘బాంబే హోజరీ’ వస్త్ర దుకాణం, గోదాములో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, చార్మినార్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. బాంబేహోజరీ హోల్‌సేల్ షాప్, గోదాం నుంచి భారీగా పొగలు వెలువడుతున్నాయి. పొగల ధాటికి స్థానికులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. మంటలు ఇతర షాపులకు వ్యాపించకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ కావడంతో భారీ ఎత్తున నష్టం వాటిల్లే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

నవంబర్‌లోగా కాఫర్ డ్యాం నిర్మించాలి’

కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కవిత డిమాండ్



జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 19: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నెపల్లి లక్ష్మీ పంపుహౌస్‌ను టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత సందర్శించారు. కన్నెపల్లి పంప్ హౌజ్ వ్యూ పాయింట్ నుంచి గోదావరి ప్రవాహాన్ని పరిశీలించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నెలకొన్న నీటి సమస్యను పరిశీలించేందుకు కవిత పర్యటన కొనసాగుతోంది. ఈ సందర్భంగా టీఆర్ఎస్ చీఫ్ మాట్లాడుతూ.. ప్రాణహిత నీటిని మళ్లించేందుకు కాఫర్ డ్యాం నిర్మించాలని డిమాండ్ చేశారు. నవంబర్ నెలాఖరులోగా కాఫర్ డ్యాంను నిర్మించకుంటే కన్నెపల్లి పంపు హౌస్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.మేడిగడ్డను బూచీగా చూపి రైతులకు నష్టం చేయవద్దని కవిత అన్నారు. ప్రశ్నించి, పోరాడటమే కాకుండా ప్రభుత్వానికి పరిష్కార మార్గాలను చెబుతున్నామన్నారు. ప్రజల సమస్యలు పరిష్కారం కావాలన్న చిత్తశుద్ధితో తాము ఇక్కడ వరకు వచ్చామని తెలిపారు. ఏదో రాజకీయాలు చేస్తూ టీవీల్లో కనిపించాలనే ఉద్దేశం ఉన్న పార్టీ టీఆర్ఎస్ కాదని.. తాము చేసిన సూచనలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని రైతులకు మేలు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

గోరఖ్‌నాథ్ ఆలయంలో సీఎం యోగి కన్యా పూజ..



లక్నో,అక్టోబర్,19:ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సోమవారం మహానవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గోరఖ్‌పూర్‌లోని గోరఖ్‌నాథ్ ఆలయంలో సంప్రదాయబద్ధంగా కన్యా పూజ నిర్వహించారు. శరన్నవరాత్రులలో భాగంగా తొమ్మిదో రోజున నిర్వహించే ఈ విశిష్ట పూజలో ఆయన పాల్గొన్నారు. శక్తి స్వరూపిణులైన బాలికలను ఆరాధించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా యోగి ఆదిత్యనాథ్ స్వయంగా బాలికల పాదాలను ప్రక్షాళన చేసి, వారికి తిలకం దిద్దారు. అనంతరం హారతి ఇచ్చి, పూజలు నిర్వహించి, వారికి వస్త్రాలు, ప్రసాదం, దక్షిణలను సమర్పించి గౌరవించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన తెలి పారు.

పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రాంగణంలో భండారా (సామూహిక భోజనం) ఏర్పాటు చేశారు. అనంతరం యోగి ఆదిత్యనాథ్ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ, విజయదశమి వేడుకల సందర్భంగా కీలక సూచనలు చేశారు. పండుగను ప్రతిఒక్కరూ ఉత్సాహంగా జరుపుకోవాలని, అయితే అదే సమయంలో భద్రతా ప్రమాణా లను ఏమాత్రం విస్మరించకూడదని ఆయన కోరారు. చెడుపై సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి, దుర్గుణాల నుంచి విముక్తి పొందాలనే గొప్ప సందేశాన్ని అందిస్తుందని ఆయన పేర్కొన్నారు.

త్వరలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరగనున్నాయా..?



న్యూఢిల్లీ,అక్టోబర్,19:త్వరలో దేశంలో ఇంధన ధరలు పెరగనున్నాయా..? అవుననే అంటున్నారు ఆర్థికవేత్తలు. నవంబర్‌లో పెట్రోల్, డీజిల్ రేట్లు పెరిగే అవకాశముందని ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ ముఖ్య ఆర్థికవేత్త అలెగ్జాండ్రా హర్మన్ ప్రసాద్ విశ్లేషించారు. వచ్చే ఏడాది ఏడు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నవంబర్‌లోనే ధరల్లో పెరుగుతాయని ఆయన అంచనా వేశారు. గత మేలో ప్రకటించిన ఇంధన ధరల పెంపులో సగం వరకు ఈ పెరుగుదల ఉండవచ్చని పలు వురు ఆర్థికవేత్తలు చెబుతున్నారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా కేంద్రం మేలో ఇంధన ధరలు పెంచిన విషయం తెలిసిందే. ఈ పెరుగుదల వల్ల రిటైల్ ద్రవ్యోల్బణం అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో 6.2 శాతానికి, 2027 మొదటి మూడు నెలల్లో 6.5 శాతానికి చేరవచ్చని, తద్వారా ఆర్‌బీఐ నిర్దేశించిన 2 నుంచి 6 శాతం ద్రవ్యోల్బణ లక్ష్యాన్ని మించిపోతుందని ఆర్థికవేత్తలు వివరిస్తున్నారు. అక్టోబర్ ప్రారంభంలో జరిగిన ద్రవ్య విధాన సమీక్షా సమావేశంలో అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికానికి ద్రవ్యోల్బణం 6 శాతంగా ఉంటుందని, జనవరి-మార్చిలో ఇది 5.7 శాతానికి తగ్గుతుందని ఆర్‌బీఐ అంచనా వేసింది. మార్చిలో ఆర్థిక సంవత్సరం ముగిసేపాటికి ద్రవ్యోల్బణం 5.2 శాతంగా ఉంటుందని పేర్కొంది. మరోవైపు వచ్చే ఏడాది ధరల ఒత్తిడి పెరుగుతుందని ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ భావిస్తోంది. మార్చిలో ద్రవ్యోల్బణం 5.4 శాతంగా ఉంటుందని అంచనా వేస్తోంది.

భూ వివాదాల శాశ్వత పరిష్కారమే

ప్రభుత్వ లక్ష్యం: మంత్రి పొంగులేటి



హైదరాబాద్, అక్టోబర్19: రాష్ట్రంలో భూ వివాదాల శాశ్వత పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో భూ భారతి, రెవెన్యూ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణంతోపాటు సేవల్లో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. 34 నెలల్లో 12,40,366 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేసినట్లు వివరించారు. భూ భారతి చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత 5,68,858 పాస్ పుస్తకాలు పంపిణీచేశామని చెప్పారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు రీ-సర్వేతో పరిష్కారమని పేర్కొన్నారు. సాగుదారుల ను గుర్తించి చట్టబద్ధమైన భూ హక్కుల కల్పన చేస్తున్నామని అన్నారు. నారాయణపురంలో 906 మంది రైతులకు 1,600 ఎకరాలకు పైగా భూహక్కులు కల్పించామని సోదాహరణంగా వివరించారు. సూర్యాపేట జిల్లాలోని 15 గ్రామాల్లో 2,400 మంది రైతులకు 3,450 ఎకరాలకు పట్టాలు అందించామని తెలిపారు. పాస్ పుస్తకాలతో రైతులకు బ్యాంకు రుణాలు, రైతు భరోసా సహా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో రీ-సర్వే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. భూ హక్కుల కోసం ఎదురుచూస్తున్న రైతులకు న్యాయం చేయాలని అధికారులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు.

ఏపీలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల



అమరావతి,అక్టోబర్,19:ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (జెడ్పీటీసీ) ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఈ నోటిఫికేషన్‌తో రాష్ట్రంలో మరోసారి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లయింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 659 జెడ్పీటీసీ స్థానాలకు, 9,829 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎస్ఈసీ స్పష్టం చేశారు. వాస్తవానికి రాష్ట్రంలో 663 జెడ్పీటీసీలు, 9,859 ఎంపీటీసీలు ఉండగా, కొన్ని కారణాల వల్ల మిగిలిన స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం లేదని తెలిపారు. మొత్తంగా 10,488 స్థానాలకు ఈ ఎన్నికల ప్రక్రియ జరగనుంది. ఎన్నికల ప్రచార ఖర్చుపై కూడా కమిషన్ స్పష్టతనిచ్చింది. జెడ్పీటీసీ అభ్యర్థి గరిష్ఠంగా రూ. 8 లక్షల వరకు, ఎంపీటీసీ అభ్యర్థి రూ. 4 లక్షల వరకు ఖర్చు చేసుకోవచ్చని పునేఠా వివరించారు. ఎన్నికల నిర్వహణ కోసం 687 మందిని ఎంపీటీసీలకు, 28 మందిని జెడ్పీటీసీలకు రిటర్నింగ్ అధికారులు (ఆర్వో)గా నియమించినట్లు తెలిపారు.



నేలకొరిగిన మరో కలం యోధుడు

సీనియర్ జర్నలిస్టు శ్రీనివాసరావు మృతి



డీకే చాటింపు ప్రతినిధి, (హైదరాబాద్): సీనియర్ జర్నలిస్టు వడ్డూరి శ్రీనివాస రావు గుండె పోటుతో ఆదివారం రాత్రి మరణించారు. ఆయన వయసు 64 సంవత్సరాలు. అతనికి భార్య ఇద్దరు పిల్లలు. వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో నాగోల్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు అతనికి ఊపిరి తిత్తులు దెబ్బ తిన్నాయని చెప్పారు. వారం రోజులుగా చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి గుండెపోటు వచ్చి మృతి చెందారని శ్రీనివాసరావు సతీమణి లలితా దేవి చెప్పారు. నలభై ఏళ్ళుగా 1986లో జాగృతి పత్రికలో సబ్ ఎడిటర్ గా కెరీర్ ను ప్రారంభించిన వడ్డూరి శ్రీనివాస రావు ముప్పై ఏళ్ళు వివిధ పత్రికలో పని చేశారు. కృష్ణా పత్రిక, వార్త, సాక్షి దినపత్రికల్లో సీనియర్ సబ్ ఎడిటర్ గా పని చేసిన ఆయన ప్రస్తుతం దర్బార్ పేరుతో సొంత వెబ్ సైట్ ను నడుపుతున్నారు.నాలుగు దశాబ్దాలుగా తన కలంతో అక్షరాలు దిద్ది వార్తలుగా మలిచిన శ్రీనివాసరావు నీతీ నిజాయితో పేదరికంలో బతికాడు. తనకు వచ్చిన జీతంతో కుటుంబాన్ని పోషించుకుంటూ తన ఇద్దరు పిల్లలను చదివించుకున్నారు. ప్రభుత్వం ద్వారా ఇంటి స్థలం పొందాలనుకున్న శ్రీనివాసరావు కల నెరవేరకుండానే కన్ను మూశారు. పదిహేనేళ్ళ క్రితం సాక్షిలో పని చేస్తున్నప్పుడు అద్దె ఇంట్లో ఉంటున్న అతను ఇంటి స్థలం కోసం జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ లో సభ్యత్వం తీసుకొని లక్ష రూపాయలు చెల్లించారు. కొన్నేళ్ళ తర్వాత ఇంటి స్థలం రాకపోవడంతో సొసైటీకి చెల్లించిన డబ్బులు వాపస్ తీసుకున్నారు. ప్రభుత్వం ద్వారా ఇంటి స్థలం వస్తుందేమో అన్న ఆశతో ఉన్న శ్రీనివాసరావు తిరిగి గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీలో సభ్యుడిగా చేరారు. ఉప్పల్ లో నేటికీ అద్దె ఇంట్లో ఉంటున్న శ్రీనివాసరావు సొంత ఇంటి కల నెరవేరకుండానే చనిపోయారు.

నిన్న రఘు....నేడు శ్రీనివాసరావు

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత కూడా జర్నలిస్టులు ఇళ్ళస్థలాలు పొందే అవకాశం లేకుండా పోతుంది. తరాలు మారినా తలరాతలు మారని చందంగా, ప్రభుత్వాలు మారినా... పాత్రికేయులు స్థితి గతులు మారడం లేదు. ఇళ్ళస్థలాల కోసం ఎదిరి చూస్తూ ఎంతోమంది జర్నలిస్టులు చనిపోతున్నారు. నిన్న చనిపోయిన సీనియర్ జర్నలిస్టు రఘు అంత్యక్రియలు ముగియగానే నేడు సీనియర్ జర్నలిస్టు శ్రీనివాసరావు కన్ను మూశారు. సీనియర్ జర్నలిస్టు వడ్డూరి శ్రీనివాసరావు మృతి పట్ల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, తన్నీరు శ్రీనివాస్ లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం ప్రకటించారు.

గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ సభ్యుడు, సీనియర్ పాత్రికేయుడు వడ్డూరి శ్రీనివాసరావు అకాల మృతికి సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్, డైరెక్టర్ యర్రమిల్లి రామారావు లు ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు.

మహిళ కార్మికులకు దసరా కానుకగా

చీరలు పంపిణీ చేసిన చిలుక మధుర ఉపేందర్ రెడ్డి



మహేశ్వరం, (డీకే చాటింపు) మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ పరిధిలోని పారిశుద్ధ కార్మికులకు, దేవాలయాల్లో పనిచేసే మహిళలకు, దసరా కానుకగా చీరలు పంపిణీ చేసిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు లిచిలుక మధుర ఉపేందర్ రెడ్డి.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినిత్యం సమాజ సేవలో నిమగ్నమయ్యే మహిళా కార్మికులకు దసరా కానుకగా ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా చీరలు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. దీనిని ఒక బాధ్యతగా తీసుకొని రాబోయే రోజులలో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకుపోతామని తెలియజేశారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు.. వివిధ కాలనీల్లో వేడుకల్లో పాల్గొన్న బద్దం సృజన ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి

- గడ్డిఅన్నారం డివిజన్ ఆడపడుచులందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపినబద్దం సృజన ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి



ఎల్బీనగర్, (డీకే చాటింపు) గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా బద్దం సృజన ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి గారు పాల్గొని, కాలనీ మహిళలు, ఆడపడుచులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సరస్వతి నగర్ కాలనీలో మల్లికా రెడ్డి గారి ఆధ్వర్యంలో, శ్రీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, గౌతమ్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలతో పాటు వివేకానంద నగర్ కాలనీలో వీర్ సావర్కర్ యువజన మంచ్ ఆధ్వర్యంలో దుర్గామాత మండపం వద్ద నిర్వహించిన సద్దుల బతుకమ్మ సంబరాల్లో సృజన గారు పాల్గొని మహిళలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బద్దం సృజన ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి గారు మాట్లాడుతూ.. పూలనే దేవతగా కొలిచే అపురూపమైన పండుగ మన బతుకమ్మ అని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగ మహిళల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. గత ఎనిమిది రోజులుగా తీరొక్క పూలతో ఎంతో సంబరంగా జరుపుకున్న బతుకమ్మ వేడుకలు చివరి రోజైన సద్దుల బతుకమ్మతో మరింత వైభవంగా ముగియడం ఆనందంగా ఉందన్నారు. గడ్డిఅన్నారం డివిజన్‌లోని ఆడపడుచులందరూ సద్దుల బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో, కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థిస్తూ గడ్డిఅన్నారం డివిజన్ మహిళలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎఐకెఎస్ 36వ జాతీయ మహాసభల లోగో ఆవిష్కరణ



డీకే చాటింపు ప్రతినిధి,(హైదరాబాద్): నవంబర్ 15 నుండి 18 వరకు నల్లగొండ పట్టణంలో జరిగే అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) 36వ అఖిల భారత మహాసభల లోగోను ఆహ్వాన సంఘం అధ్యక్షులు, ఎఐకెఎస్ కేంద్ర కమిటి సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ లు ఆవిష్కరించారు.హైదరాబాద్‌లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఎఐకెఎస్ జాతీయ మహాసభల లోగో ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగాఆ 1.58 కోట్లకుపైగా సభ్యులతో ప్రపంచంలోనే అతిపెద్ద రైతాంగ ఉద్యమ సంస్థ అఖిల భారత కిసాన్ సభ. సామ్రాజ్యవాదం, భూస్వామ్యానికి వ్యతిరేకంగా సాగించిన ప్రతిఘటన వారసత్వాన్ని తెలంగాణ, తెభాగా, వర్లీ ఆదివాసీ, పున్నప్రవయలార్, సుర్మాలోయ రైతుల పోరాటాల చైతన్యదీప్తిని నేటికీ ముందుకు తీసుకువెళ్తోంది. ఆ పోరాటాల స్ఫూర్తితో నయ ఉదారవాద ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలను నిర్మిస్తూ అనునిత్యం రైతులకు అండగా నిలుస్తుంది. అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) 36వ అఖిల భారత మహాసభలు నవంబర్ 15 నుండి 18 వరకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కేంద్రమైన నల్లగొండలో జరుగుతున్నాయి. మహాసభ ప్రారంభం సందర్భంగా నల్గొండలో నవంబర్ 15న లక్ష మందితో రైతులతో భారీ ప్రదర్శన, అనంతరం బహిరంగసభ ఉంటుంది. ఈ మహాసభకు దేశం నలుమూలల నుంచి 850 మందికిపైగా ప్రతినిధులు, పరిశీలకులు, నాయకులు హాజరుకానున్నారు.కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి మూడ్ శోభన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, నంద్యాల నర్సింహారెడ్డి, పి.జంగారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మాదినేని రమేష్, కందాల ప్రమీల, మల్లు నాగార్జునరెడ్డి, సహాయ కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు, బొంతు రాంబాబు, మాటూరు బారాజుగౌడ్, లెల్లెల బాలకృష్ణ, ఉడత రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం కార్యక్రమం లో పాల్గొన్న టీపీసీసీ తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులుసామిడి గోపాల్ రెడ్డి చరణ్ సామిడి



మహేశ్వరం, (డీకే చాటింపు) ప్రశాంతి హిల్స్ డివిజన్ 58 లోని లెనిన్ నగర్ లో అభయ ఆంజనేయ స్వామి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవి నవరాత్రుల సందర్భంగా పూజ మరియు అన్నదానం కార్యక్రమం జెరిగింది ఈకార్యక్రమా నికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులుసామిడి గోపాల్ రెడ్డి చరణ్ సామిడి హాజరైయారు అనంతరశీ అమ్మవారిని దర్శించుకొని అన్న దాన కార్యక్రమం లో పాల్గొన్నారు ఈకార్యక్రమా నికి అధ్యక్షులు నాగరాజు, మహేష్ ప్రభు, దశరద్, నవీన్, సాయి సురేందర్ పండు చింటూ కుమార్,చిన్న,మరియు కమిటీ సభ్యులు తోపాటు స్థానిక కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ కమిటీ సభ్యులు డివిజన్ యూత్ ప్రెసిడెంట్ వరికుప్పల శివ ఇందిరమ్మ కమిటీ సభ్యులు టిట్ల కృష్ణ రాష్ట్ర నాయకులు మట్ట సత్యనారాయణ దేరింగుల వంశీ , రాకేష్, ,చెర్రీ మరియు బస్తీ వాసులు మరియు తదితరులు పాల్గొన్నారు.

విజయదశమి శుభాకాంక్షలు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య



నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్19 (డీకే చాటింపు): నిజామాబాద్ జిల్లా ప్రజలందరికి మహర్నవమి మరియు అక్టోబర్ 20 మంగళవారం న విజయ దశమి పండుగ సందర్భంగా పోలీస్ శాఖ తరపున కమీషనర్ సాయి చైతన్య శుభాకాంక్షలు తెలిపారు. దుష్ట శక్తుల పై విజయానికి సంకేతముగా జరుపుకునే ఈ వండుగను స్ఫూర్తిగా తీసుకొనిప్రజలందరుఐక్యత , సమగ్రతల కోసం కృషి చేయాలని, ఈ సంవత్సర కాలంలో వారి వారి కుటుంబ సభ్యులతో నిండు ఆయురారోగ్యాలతో మరియు సుఖ సంతోషము లతోకాలం గడపాలనికోరారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలలో శాంతి భద్రతలకు మరియు మత విద్వాంసాలకు తావు ఇవ్వకుండా అందరు సహక రించవలెనని కోరారు. ఎల్లప్పుడు ప్రజలు మరియు పోలీస్ సిబ్బంది స్నేహ పూర్వకంగా మరియు సోదర స్వభావముతో మెలగాలని ఆకాంక్షించారు.

-దుర్గామాత అమ్మవారిని దర్శించుకున్న

భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకిర్త్..



బెల్లంపల్లి(డీకే చాటింపు)పట్టణంలోని హనుమాన్ బస్తి 33 వ వార్డు లో భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ దుర్గామాత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భవాని ఉత్సవ కమిటీ వారి ఆహ్వానం మేరకు అమ్మవారి సాయంకాల హారతి కార్యక్రమానికి హాజరైన జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరి శెట్టి సంకీర్త్ ఐపిఎస్,ఈ కార్యక్రమంలో భాగంగా సిరిసిటీ సంకీర్త్ ఐపిఎస్ కు,భవాని ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి పూలమాల వేసి సత్కరించి భవాని మాల వేసుకున్న భవాని మాతలు బోనాలతో స్వాగతం పలికారు, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 33 వ వార్డ్ భవని ఉత్సవ కమిటీ సభ్యులు గోమాస తిరుపతి,పోలు శ్రీనివాస్, గొండ్రఅనుదీప్, గోమన సాయి, క్రాంతి, సన్నీ, గుమ్మడికృష్ణంరాజు,నతీష్,వనుపునేటి వంశీ,దుర్గం వంశీ, సాగర్,మరియు భవాని స్వాములు భక్తులు, పాల్గొన్నారు.

నిజామాబాద్ నగరంలో విశిష్ట జ్యువెలర్స్

ప్రారంభించిన సినీనటి నిధి అగర్వాల్



నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 19 (డీకే చాటింపు):నిజామాబాద్ నగరంలో విశిష్ట గోల్డ్ అండ్ జ్యువెలర్స్ నగల షోరూం సినీనటి నిధి అగర్వాల్ ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ అతిథిగా పాల్గొన్నారు. యజమానులు శ్రీనివాస్ ఆనంద్ బాబు మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా ప్రజలకు రీజనబుల్ రేట్లలో నగల అందించాలని సంకల్పంతో నగరంలో మూడో బ్రాంచ్ ప్రారంభించినట్లు తెలిపారు. ఇట్టి ప్రారంభ కార్యక్రమంలో నగరంలోని ప్రముఖులు వివిధ సంఘాల వారు పాల్గొన్నారు.విశిష్ట నగల షాపు ప్రారంభోత్సవం సందర్భంగా. యజమాన్యా నికి వాసవి క్లబ్ నిజాంబాద్ అధ్యక్షులు కోటగిరి రాజేశ్వరి శుభాకాంక్షలు తెలిపారు. నగరంలో వ్యాపారంలో మరింత అభివృద్ధి చెందుతూ ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు.ఈ సందర్భం గా విచ్చేసిన సినీ కథానాయ కురాలు కుమారి నిధి అగర్వాల్ చేతులమీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. వాసవి క్లబ్ ద్వారా ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

అధికారులు..మేమే లోకల్..!



హైదరాబాద్, : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమం సందర్భంగా అధికారులు ప్రోటోకాల్ పాటించకపోవడంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అలిగి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. ముఖ్య అతిథి అయిన దానం రాకుండానే అధికారులు లక్కీ డ్రా నిర్వహించడంతో అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ క్రమంలోనే ఆ వ్యవహారంపై మీడియా సమావేశం ఏర్పాటు చేసిన దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాత బస్తీ ఎమ్మెల్యేల లాగా అధికారులపై దాడి చేస్తేనే వారు మాట వింటారు అంటే అలా చేయడానికి రెడీ అని ఆయన షాకింగ్ కామెంట్స్ చేశారు.అంతేకాదు, ప్రభుత్వ అధికారులను కొట్టడం తనకు కొత్తేమీ కాదని, అది తనకు అలవాటేనని ఆయన చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. గతంలో ఒక ప్రభుత్వ అధికారిని కొట్టి జైలుకు కూడా పోయానని మీడియా ముందే ఆయన వ్యాఖ్యానించడం విశేషం. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోందని, లబ్ధిదారుల జాబితాలో తన నియోజకవర్గం వారు కాకుండా బయటివారు ఉన్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇక, హౌసింగ్ బోర్డు ఎండీ గౌతమ్ తీరుతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని ఆయన అన్నారు. ఆయన వ్యవహారంపై సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తానని, అసెంబ్లీలో కూడా ఈ వ్యవహారం గురించి ప్రస్తావిస్తానని చెప్పారు. రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా అధికారులు ప్రోటోకాల్ పాటించాలని అన్నారు.అధికారులు వస్తుంటారు పోతుంటారు?దానం నాగేందర్ లోకల్ అంటూ ఇడియట్ లో రవితేజ మాదిరి డైలాగ్ చెప్పారు దానం. ప్రభుత్వంపై అసంతృప్తి లేదని, తన వ్యాఖ్యలను వక్రీకరించొద్దని స్పష్టం చేశారు. ఎక్కడో కుట్ర జరుగుతోందని, అధికారుల ప్రవర్తన బాగోలేదని, దాని వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని అన్నారు. 'తెలంగాణ క్యాబినెట్ లో మంత్రులకు పూర్తి స్థాయి స్వేచ్ఛ లేదు. దీంతో పనులు జరగడం లేదు. మంత్రులకు వారి శాఖలపై పూర్తి స్థాయి అధికారం, హక్కులతో పనిచేసే కల్పించాలి. వారికి స్వేచ్ఛ ఇవ్వకుంటే కొత్త సమస్యలు తెర మీదకు వస్తాయి. వారికి డబ్బులు విడుదల చేసే హక్కు లేదు. దానికి వారు ఆర్థిక శాఖ చుట్టూ తిరుగుతున్నారు. నా నియోజకవర్గానికి నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలు పనులను ఆమోదించినా ఆర్థిక శాఖ నిధులు విడుదల చేయడం లేదు' అని కొత్తగూడెం సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రెండున్నరేళ్లుగా ఇదే సాగుతుందని, ఒక్క పని కూడా ముందుకు వెళ్లడం లేదని, నేను కాంగ్రెస్ మిత్రపక్షం సీపీఐ ఎమ్మెల్యేను కాబట్టి నేను ప్రభుత్వాన్ని బలంగా విమర్శించలేను. అలాగని మౌనంగాను ఉండలేను. మంత్రులు నా సౌమ్యతను తీసుకుని వ్యవహరిస్తున్నారు అని కూనంనేని ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లా ప్రజలకు విజయదశమి

శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్, ప్రభుత్వ సలహాదారు





నిజామాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 19(డీకే చాటింపు): విజయ దశమి వేడుకను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా జరుపుకునే విజయదశమి వేడుకను ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. దసరా పండుగ అందరి జీవితాల్లో విజయాలు సమకూర్చాలని, చేపట్టిన ప్రతీ కార్యం విజయవంతం కావాలని అభిలషించారు. విజయ దశమి వేళ అన్ని వర్గాల వారు సుభిక్షంగా, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
మంగళవారం,అక్టోబర్,20, 2026

ట్రంప్..తిరోగమనం

ఏదిఏమైనప్పటికీ తమ దేశం నుంచి అధిక సుంకాలను వసూలు చేస్తున్న ప్రపంచ దేశాల నుంచి అదే స్థాయిలో టారిఫ్‌లను వసూలు చేస్తామని ప్రగల్భాలు పలికిన అమెరికా అధ్యక్షుడు ఇప్పుడు మడమ తిప్పుతున్నారు. ట్రంప్ టారిఫ్‌లు కేవలం ఆర్థిక సమస్యలతోనే కాకుండా, అంతర్జాతీయ సంబంధాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. కెనడా, మెక్సికో, యూరోపియన్ యూనియన్ వంటి సన్నిహిత మిత్ర దేశాలు కూడా ఈసుంకాల బారిన పడ్డాయి. ఈ దేశాలు ట్రంప్ చర్యలకు ప్రతీకార చర్యలుగా అమెరికన్ ఉత్పత్తులపై సుంకాలు విధించే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితి వాణిజ్య యుద్ధాలకు దారితీసి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మరింత బలహీనపరిచే ప్రమాదం ఉందని అంటున్నారు తొలుత ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 10 నుంచి అమల్లోకి రావాల్సిన ప్రతీకార సుంకాల ఆదేశాలను 90 రోజుల పాటు నిలిపివేశారు. ఆ వెంటనే టారిఫ్‌ల నుంచి 20 సెక్టార్ల ఉత్పత్తులకు మినహాయింపు కల్పించారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయాలను గమనిస్తే విషయం ఇట్టే అర్థమవుతున్నది వాస్తవానికి ఇతర దేశాల నుంచి అమెరికాకు దిగుమతి అవుతున్న వస్తువులపై భారీ టారిఫ్‌లను విధించడం వల్ల తమ దేశంలో స్వదేశీ వస్తువుల కొనుగోళ్లు పుంజుకుంటాయని ట్రంప్ భావించారు. అలాగే, అమెరికాలో ఇబ్బడిముబ్బడిగా పరిశ్రమలు పుట్టుకొచ్చి, తమ పౌరులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయనేది ట్రంప్ ఆలోచన. అందుకే ముందూవెనకా ఆలోచించకుండా ప్రపంచ దేశాలపై ప్రతీకార సుంకాలను ప్రకటించేశారు. ఈ క్రమంలోనే చైనాపైనా టారిఫ్‌లు వేశారు. ట్రంప్ దెబ్బకు ఇతర దేశాలన్నీ కాళ్లబేరానికి వస్తే, చైనా మాత్రం అమెరికా అధ్యక్షుడికి దీటుగా బదులిస్తూ రావడం, దీంతో ఆ దేశంపై అమెరికా మరింత పెద్ద మొత్తంలో సుంకాలు ప్రకటిస్తూ రావడం చకచకా జరిగిపోయాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'అమెరికా ఫస్ట్ విధానంతో అనేకదేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై భారీ సుంకాలు(టారిఫ్‌లు) విధిస్తూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కలవరపెడుతున్నారు. ఈ చర్యలు అమెరికన్ ఉద్యోగాలను, స్థానిక పరిశ్రమలను కాపాడతాయని ట్రంప్ వాదిస్తున్నప్పటికీ, ఇవి గ్లోబలైజేషన్ యుగానికి ముగింపు పలుకుతున్నాయని పలు దేశాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ టారిఫ్‌లు అంతర్జాతీయ వాణిజ్యంపై తీవ్ర ప్రభావం చూపుతూ, దేశాలను స్థానిక ఉత్పత్తులపై ఆధారపడేలా మార్చుతున్నాయి. 1991లో సోవియట్ యూనియన్ పతనం తర్వాత ప్రారంభమైన గ్లోబలైజేషన్ యుగం ఇప్పుడు ముగిసినట్లేనని బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ అభిప్రాయపడ్డారు. ట్రంప్ విధించిన టారిఫ్‌లు అనేక దేశాలను తమ దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడానికి దారితీస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో, అమెరికా కూడా తన స్థానిక వనరులపై ఆధారపడే అవసరం ఏర్పడుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. చైనా, భారత్, యూరోపియన్ యూనియన్ వంటి దేశాలు ఈ టారిఫ్‌లను ఎదుర్కొనేందుకు తమ ఆర్థిక విధానాలను సవరించుకుంటున్నాయి.ట్రంప్ తన టారిఫ్ విధానాన్ని సమర్థిస్తూ, అమెరికన్ పౌరులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కాపాడటమే తన లక్ష్యమని పేర్కొన్నారు. విదేశీ దిగుమతులపై అధిక సుంకాలు విధించడం ద్వారా స్థానిక తయారీ రంగాన్ని ప్రోత్సహించాలని, విదేశీ ఉత్పత్తుల ఆధిపత్యాన్ని తగ్గించాలని ఆయన భావిస్తున్నారు. అయితే, ఈ చర్యలు అమెరికన్ వినియోగదారులకు వస్తువుల ధరల పెరుగుదలకు దారితీస్తాయని, అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలను దెబ్బతీస్తాయని విమర్శకులు హెచ్చరిస్తున్నారు. ఉదాహరణకు, చైనా నుంచి దిగుమతి అయ్యే ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ విడిభాగాలపై విధించిన సుంకాలు అమెరికన్ కంపెనీల ఉత్పత్తి ఖర్చులను పెంచుతున్నాయి.రెండు దేశాల మధ్య జరిగిన సుంకాల యుద్ధం పర్యవసానంగా ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. అమెరికా మార్కెట్ల పైనా ఈ ప్రభావం కనిపించింది.అంతర్జాతీయంగా నెలకొన్న ఈ గందరగోళ పరిస్థితుల వల్ల మదుపరుల కోట్లాది సంపద ఆవిరైపోయింది. అమెరికాలో ద్రవ్యోల్బణం పెరగడంతోపాటు ఆర్థికమాంద్యం ఛాయలు కనిపించాయి. ట్రంప్ వైఖరిపై ఆయన మద్దతుదారులే బహిరంగంగా పెదవి విరిచారు. దీనికి యావత్ ప్రపంచం సాక్ష్యంగా నిలిచింది.



సృజన,అనుసృజనల్లో సవ్యసాచి రఘువర్మ

భారతీయ సాహిత్యంలో రవీంద్రనాథ్ ఠాగూర్,తెలుగు సాహిత్య లోకంలో అడవి బాపిరాజు, అలిశెట్టి ప్రభాకర్,గుండోజు యాదగిరి...

వివిధ ప్రక్రియల్లో రచనలు చేస్తునే చిత్రకళలోనూ రాణించారు. అదే కోవలోకి డా.టి.లక్ష్మినారాయణ చేరుతారు.వీరు



ప్రముఖ కవి, రచయిత, చిత్రకారుడు, అనువాదకులు, పరిశోధకులు. గాయకులు ,నిగర్వి డాక్టర్ తుమ్మనపల్లి లక్ష్మీనారాయణ రాజేశ్వరి లక్ష్మీరాజ్యం దంపతులకు జగిత్యాల లో 12 మే 1956 నాడు జన్మించారు. ఎం.ఏ. తెలుగు, ఎంఫిల్, పిహెచ్ .డి ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. విశ్వవిద్యాలయంలో పరిశోధన చేస్తున్న సమయంలోనే నిజాం కాలేజీలో పార్ట్ టైమ్ అధ్యాపకులుగా పనిచేశారు. తన రెండో తమ్ముడు రఘునాథ్ లోని రఘు అనే పేరును రవి వర్మ లోని వర్మ అనే పదం తీసుకుని రఘువర్మ అని కలం పేరు పెట్టుకున్నానని లక్ష్మీనారాయణ స్వయంగా చెప్పారు. వీరు 1970 నుంచి కవితలు రాయడం ప్రారంభించారు. అందంగా బొమ్మల కూడా వేస్తుంటారు. రఘువర్మ ఓయూలో చదువుతున్నప్పుడే అక్కడి మిత్రుల, ప్రొఫెసర్ల పుస్తకాలకు ముఖ చిత్రాలు వేశారు. కుందుర్తి కవితా దృక్పథం– నాలోని నాదాలు ఏం ఫీల్ (గ్రంథం(1990) ప్రచురితమైంది. హైదరాబాదులో వెన్నెల డిగ్రీ కళాశాలలో కూడా అధ్యాపకునిగా పనిచేసి అనివార్య కారణాల వల్ల స్వగ్రామం జగిత్యాలకు వచ్చారు. కొన్నేళ్లు జగిత్యాల దగ్గరలో లోని చల్ గల్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేశారు. జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. తర్వాత గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో తెలుగు అధ్యాపకుడిగా పని చేశారు. వివిధ గురుకుల విద్యాలయాల్లో పనిచేసి 2014 లో పదవీ విరమణ పొందారు. పదవీ విరమణ తర్వాత ఉదృతంగా సాహిత్య వ్యాసంగం కొనసాగించారు. రఘువర్మ 1979 నుండి 2008 వరకు రాసిన కవితల్ని 'హృదయ జలధి' అనే పేరుతో తొలి వచన కవితా సంపుటిని వెలువరించారు. దీనిలో 37 కవితలు ఉన్నాయి. "హృదయ జలధి కవితా సంపుటి రూపొందించిన రఘువర్మ ఎం.ఏ తరగతులలో మా విద్యార్థి. కవితాధర్మాలను బాగా ఆకలించుకున్నవాడు" అని డా. సి నారాయణ రెడ్డి గారు ముందుమాటలో కవిని ప్రశంసించారు. దేశాన్ని కబళించడానికి వచ్చిన శత్రువును నీ మూడో కన్ను అయినా తుపాకీతో బూడిద చేసే త్రినేత్రుడవు నీవు (57పుట) సైనిక సోదరా అనే కవితలో జవాన్ల ధైర్యాన్ని, దేశభక్తిని ఉన్నతంగా వర్ణించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అనేక రంగాల్లో అనేక విధాలుగా కుంభకోణాలు జరిగాయి .వీటిపై ఎందరో కవులు స్పందించారు. అలాగే రఘువర్మ కుంభకోణం కవిత రాశాడు. ఏ గణిత శాస్త్రజ్ఞుడూ/ చెప్పలేని కోణం/ ప్రతి పెద్దమనిషి/ ఎక్కు పెట్టే బాణం /కుంభకోణం! (24 పుట)అని కుంభకోణాన్ని నిర్వచించి,అవినీతి పరుల బాగోతం బహిర్గతం చేశారు కవి. అలిశెట్టి ప్రభాకర్ రాసిన వేశ్య మినీ కవిత చైతన్య గీతిక. రఘువర్మ కూడా వేశ్య దయనీయ స్థితి గురించి 1982లో కవిత రాశాడు. "ఈ సమాజంలో కుళ్ళింతో/ కొలిచి చూపించే కొలబద్ద ఆమె!/ మనతో మనలాగే బ్రతికే/ నరరూప పశువులకు / భార్య గాని భార్య ఆమె!"...(20 పుట) అని విటులకు చెంప చెల్లుమనిపించారు. దీనిలో సామాజిక చైతన్యం కలిగించే కవితలతో పాటు భావకవుల ప్రభావంతో రాసిన కవితలు కూడా ఉన్నాయి. కొన్ని కవితలకు భావానుగుణంగా రమణీయమైన చిత్రాలను వేశారు. తర్వాత కవిత్వం వింత భాష, మూడో కంటి చూపు, మేఘ రాగ రంజని (ప్రేమఖండికా కావ్యం). అనే కవితా సంపుటాలను తీసుకొచ్చారు. కవికులతిలకుడు కాళిదాసు రాసిన మేఘసందేశం ప్రపంచ సాహిత్యంలోనే శిఖరాయమానమైన రచన అని ప్రతీతి. దీనిని మేఘ దూతం,దూతకావ్యం అని కూడా పిలుస్తారు.ఇది దూత కావ్యాలకు మార్గదర్శి . మానవుని గుండెగూటిలోని సూక్ష్మ భావాలను కవి వివరించారు. అంతేకాక భౌతికమైన ప్రకృతిని భౌగోళికమైన నదులను గిరులను పట్టణాలను పల్లెలను రమణీయంగా వర్ణించారు. దీనిలో విప్రలంభ శృంగారం అంగిరసం. ఈ మేఘసందేశం లో పూర్వమేఘంలో 67 శ్లోకాలు, ఉత్తర మేఘంలో 57 శ్లోకాలున్నాయి. ఇవన్నీ మందాక్రాంతవృత్తంలో ఉన్నాయి. రాయప్రోలు, మల్లాది లక్ష్మీపతి శాస్త్రి డా. ముకురాల వంటి వారు తెలుగులోకి తర్జుమా చేశారు. వీరి వరసలో రఘువర్మ చేరారు. స్వేచ్ఛా వచన కవిత శైలిలో వచ్చిన మొదటి అనువాద గ్రంథం ఇది. యక్షుడు కుబేరుని వద్ద పనిచేస్తున్నాడు. యక్షునికి కొత్తగా పెళ్లయింది యక్షుని భార్య విశాలాక్షి.తన భార్య గురించి ఆలోచిస్తూ విధి నిర్వహణ సరిగా చేయలేదు. దాంతో కుబేరుడు కోపించి యక్షున్ని శపిస్తాడు. దాంతో యక్షుడు రామగిరి ఆశ్రమ ప్రాంతానికి వస్తాడు. భార్యవియోగాన్ని భరించలేని యక్షుడు యుక్తాయుక్తం మరిచి ఆకాశంలోని మేఘాన్ని తన భార్య దగ్గరికి దూతగా వెళ్లమని ప్రార్థించి భార్యకు సందేశం పంపుతాడు. దీనిలో అలకానగర మార్గం,అలకానగరం,యక్షుని గృహం.. వర్ణిస్తూ,తన వియోగ బాధను భార్యకు తెలియజేయమని చెప్తాడు యక్షుడు. కశ్చిత్కాన్తా విరహ గురుణా స్వాధికారా త్రమత్త: ...మొదటి శ్లోకాన్ని అల యక్షుడొ కడు పరాకున భృత్యవిధిని మరచిన ఫలితంగా/ యక్షరాజు చేత ఏడాది పాటు భార్యా విరహ భార శిక్షానుభవ్యశప్తుడై ... యక్షుడు రామగిరి ఆశ్రమానికి చేరుకున్నారని మూలానికి అనుగుణంగా అనువదించారు రఘువర్మ. ఇక్కడ ప్రమత్త: అంటే పరాకున అచ్చ తెలుగు పదాన్ని వాడారు.,స్నిగ్ధచ్ఛాయాతరుషు కు చిక్కటి నీడల చెట్లు అంటూ చక్కని సులభపదాలను ఉపయోగించారు. కామార్తా హి ప్రకృతి కృపణా శ్చేతనా శ్చేతనేషు..అనే శ్లోకపాదాన్ని కామ బాధితులు కదిలే కదలని వాటి విషయంలో స్వభావ రీత్యా బుద్ధి లేనివారు కదా!.. అని సరళమైన శైలిలో అనువదించారు రఘువర్మ ధూమజ్యోతి.. అనేపాదంలో పొగ ,నీరు, నిప్పు,గాలులు కలయిక మేఘం అని దేశ పదాలను వాడారు. ఆషాడస్య ప్రథమ దివసే ..ను ఆషాడమాసం తొలిరోజున.. అన్నారు.ఇందులో భార్యా విరహ భార శిక్షానుభవ్య శప్తుడు, మందార తరుచ్ఛాయలు, విలాస పద్మం ,అంబర చుంబితాలు, జల ధారాయంత్ర గృహ భావన, వినోద క్రీడా నిమగ్నులు, రతి సౌఖ్య గంధాలు...వంటి సంస్కృత సమాసాలు,ఆలంకారిక భావచిత్రాలు ప్రకాశిస్తాయి. నెలవంక వెన్నెల మట్టి వాసనలు తొలిముగ్గల నేల అరటి గచ్చు చ్చు నేలలు చిగురాకులు ఇటువంటి అచ్చ తెలుగు పదబంధాలు సమాసాలు స్వేచ్ఛను వాదానికి వన్నె తెచ్చాయి ఇంతేకాక రుతుసంహార:, కాలిదాసు.నీతిశతకమ్, భర్తృహరి.సంస్కృత రచనలను మూలానికి తగినట్టుగా తెలుగులోకి స్వేచ్ఛానువాదం చేశారు. ఆంగ్ల గీతాంజలి గ్రంథానికి సాహిత్యంలో నోబెల్ బహుమతి పొందిన తొలి భారతీయుడు రవీంద్రనాథ్ ఠాగూర్. ఈ కావ్యానికి ఔ.దీ.యేట్స్ పీఠిక రాశారు.ఈ గీతాంజలి మీద వందకు పైగా తెలుగు అనువాదాలు వచ్చాయి. పద్యం గేయం వచనం.. ప్రక్రియల్లో అనుసృజన జరిగింది. బెజవాడ గోపాల రెడ్డి, కొంగర జగ్గయ్య, చలం వంటి ప్రముఖులు తెలుగులోకి అనువదించారు . దీన్ని ఈ మధ్య రఘువర్మ అనుసృజించారు. "వచనంలోకి కాకుండా వచన కవిత్వంలోనికి అనువదించడం బహుశా ఇది మొదటిది కావచ్చు... వచనంలో చేసిన మిగతా అనువాదాల కన్నా,పాద నిర్మాణం వాక్య నిర్మాణం ఇందులో భిన్నంగా ఉంది. కొంతమంది అనువాదకులు రవీంద్రుని ఆంగ్ల గద్య కవిత యే పద్ధతిలో ఉందో అదే పద్ధతిలో పేరాలు పేరాలుగా అనువదించారు. రఘువర్మ దీన్ని పూర్తిగా వచన కవితలాగా పాద నిర్మాణం వాక్య నిర్మాణాలను దృష్టిలో ఉంచుకొని గీతాంజలి'ని వచన కావ్యంగా తీర్చిదిద్దాడు... తెలుగులో వచ్చిన వచన కవితా కావ్యాల సరసన ఇది చేరుతుంది" అని ఆచార్య పులికొండ సుబ్బాచారి ముందుమాటలో పేర్కొన్నారు. రఘు వర్మ దీన్ని నూతన పద్ధతిలో తెలుగులోకి స్వేచ్ఛానువాదం చేశారని తెలుస్తుంది. కేవలం పదాలను, వాక్యాలను తర్జుమా చేసినట్టుగాక గీతాంజలి హృదయావిష్కరణ చేశారు. సందర్భాన్ని బట్టి శాశ్వత శ్రావ్య రాగాలు, గానపవిత్రప్రవాహిని,విషాద బాష్ప బిందువులు మొదలైన సంస్కృత సమాసాలను అర్థవంతంగా ప్రయోగించారు. చెవుల వాకిళ్ల,చిన్న వెదురు,బంగారుబుట్ట, పసరాల మందలు ...తెలుగు సమాసాలను వాడారు. ఇందులో మూలాన్ని అనుసరించి సమాసాలను పదబంధాలను వాడినారు.This frail vessel thou emptiest again and again and fullest it ever with fresh life.. ఈ సుకుమార జీవిత పాత్రను/ నీవు పదేపదే శూన్యపరుస్తూనే /మళ్లీ కొత్త జీవితంతో నింపుతుంటావు!దీనిలో రఘువర్మ అనువాద నైపుణ్యం కనిపిస్తున్నది.The life breath of thy music runs from sky to sky (3)నీ సంగీత జీవన శ్వాస గగనం నుంచి గగనానికి/ పరుగు తీస్తుంది భావయుక్తంగా అనువదించారు రఘువర్మ. దీనిలోని 35 ఖండిక చాలా ప్రసిద్ధి పొందింది. Where the mind is without fear and the head is held high...నుఎక్కడ మనసు భయం లేకుండా ఉంటుందో ఎక్కడ మనిషి తల ఎత్తుకొని బ్రతుకుతాడో... అంటూ మూలభావం దెబ్బతినకుండా చక్కగా అనువదించారు రఘువర్మ. Cursed sleep శప్త సుషుప్తి, Sweet hormony మధుర శ్రావ్య సమ్మేళనం, Into that heaven of freedom స్వేచ్ఛా మయ స్వర్గంలోకి నా విషాదబాష్పబిందువులు... మొదలైనవి రఘువర్మ అనువాద ప్రతిభకు నిదర్శనాలు. గీతాంజలి అంటే గీతాలతో భగవంతునికి అంజలి ఘటించడం. ఈ కావ్యం లోని 103 ఖండికలను మూలానుసారంగా సమర్పణ భావం, భక్తి తత్పరత ఉట్టిపడేలా మృదు మధురసుందరంగా భాషాంతరీకరించారు రఘువర్మ. వీరు ఆంగ్ల గీతాంజలిని ఎంతో అధ్యయనం చేసి,ఆరాధన భావంతో స్వేచ్ఛానువాదం చేశారు రఘువర్మ.పదలాలిత్యం,భావగర్భితమైన భాష ఇందులో గోచరిస్తుంది. తెలుగు సంస్కృతాంగ్ల భాషల్లో పాండిత్యాన్ని సంపాదించి, భిన్న ప్రక్రియల్లో రచనలు చేసిన నిరాడంబర సాహితీవేత్త డా.తుమ్మనపల్లి లక్ష్మీనారాయణ 6 అక్టోబర్ నాడు తుది శ్వాస విడిచారు . ఇది సాహిత్య లోకానికి తీరని లోటు. అనువాద రంగంలో వీరు చేసిన కృషిని గుర్తించి,సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారంతో సత్కరించింది.

ఎర్రోజు వేంకటేశ్వర్లు
కరీంనగర్

నిజామాబాద్ జిల్లాలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 19 (డీకే చాటింపు):నిజామాబాద్ జిల్లాలో బతుకమ్మ పండుగ వేడుకలు వాడవాడలా గ్రామ గ్రామాన రంగురంగుల పూలతో బతుకమ్మలు అలంకరించి మహిళలు చిన్నారులు కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. నగరంలోని బొడ్డెమ్మ చెరువు కంటేశ్వర్ దేవాలయం ఉత్తర తిరుపతి దేవాలయము లలితా దేవి దేవాలయము నాగారం తదితర ప్రాంతాలలో సామూహికంగా బతుకమ్మ పండుగ వేడుకలు జరిపి బతుకమ్మలను చెరువులలో కోనేరులో నిమజ్జనం చేశారు. నగరంలోని సిఎన్ఆర్ రూమ్స్ అలేఖ్య రెసిడెన్సి మహాలక్ష్మి పార్క్ కన్యకా పరమేశ్వరి టెంపుల్ దుబ్బ మహాలక్ష్మి మందిర్ ప్రాంతంలో మహిళల కోలాటాలు అలరించాయి. మహార్నవమి సందర్భంగా దేవీ మాత మందిరాల్లో, గృహాలలో చిన్నారులకు గాజులు పుస్తకాలు బహుమతులు పంచిపెట్టారు.



భారత్‌ను అస్థిర పరిచేందుకు కుట్ర..!



న్యూఢిల్లీ, : మన దేశానికి పొరుగున ఉన్న శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో జెన్‌జీ ఉద్యమాలు రెజీమ్ చేంజ్ తీసుకొచ్చాయి. భారత్‌లో కూడా అలాంటి మార్పులు కావాలనే వాదనలు వినిపిస్తున్నాయి. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌లలో ప్రభుత్వ మార్పులు, తిరుగుబాటు ఉద్యమాలతో పాలనా వ్యవస్థలు బలహీనపడ్డాయి. సామాజిక అసమతుల్యత పెరిగింది. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు సహాయక చర్యలు, అంతర్జాతీయ సహకారం సమర్థవంతంగా నిర్వహించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. నేపాల్‌లో ఇటీవలి వరదల సమయంలో సహాయం అందించడంలో విఫలతలు కనిపించాయి. పాలనా అనుభవం, సంస్థాగత సామర్థ్యం లోపం దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అభివృద్ధి అనేది కేవలం ప్రభుత్వ మార్పుతో రాదు.. సుస్థిర వ్యవస్థలు, బాధ్యతాయుత పాలన అవసరం అని ఈ అనుభవాలు చెబుతున్నాయి.భారత్‌లో సాపేక్షంగా స్థిరమైన ప్రభుత్వం, సంస్థాగత నిర్మాణం ఉన్నాయి. అయినప్పటికీ కొన్ని వర్గాలు పాలకుల మార్పును లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. దేశం అస్థిరపడితే ప్రాంతీయ శక్తులు, ముఖ్యంగా చైనా లాంటి దేశాలు లాభపడతాయనే అంచనాలు కొందరిలో ఉన్నట్లు చర్చలు జరుగుతున్నాయి. కొన్ని శక్తులు విదేశీ ప్రభావాలకు లోనై దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, లెబనాన్‌లాంటి అస్థిర దేశాల నమూనాను భారత్‌పై ప్రయోగించాలనే ఆలోచనలు ప్రమాదకరమని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు, అల్లర్లు సృష్టించే ప్రయత్నాలు ఇందులో భాగంగా కనిపిస్తున్నాయిఎన్నికల సమయంలో లేదా అంతర్జాతీయ సదస్సులు జరుగుతున్నప్పుడు రైతు ఉద్యమాలు, సరిహద్దు ఆందోళనలు వంటివి తీవ్రరూపం దాల్చిన ఉదాహరణలు ఉన్నాయి. ఇప్పుడు బ్రిక్స్ వంటి కార్యక్రమాలను అడ్డుకునేందుకు కొత్త ఉద్యమాలు ప్రారంభం కాబోతున్నాయనే చర్చలు ఉన్నాయి. చిన్న సంఘటనలను పెద్దవిగా చిత్రీకరించి, వాటిని దేశవ్యాప్త అశాంతికి కారణంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నట్లు కనిపిస్తోంది.

తెలంగాణాంతట పూల పండగ

మహిళలు,యువతుల "బతుకమ్మ" ఆట,పాట





డీకే చాటింపు ప్రతినిధి ,(హైదరా బాద్)పూల పండగగా పిలువబడే "బతుకమ్మ" వేడుకలు తెలంగాణ అంతటా ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ జంట నగరాలతో పాటు రాష్ట్రం లోని మిగతా నగరాలు, పట్టణాలు, పల్లెలు, వీధులు "బతుకమ్మ" సంబరాలతో నిండిపోయాయి. మహిళలు, వృద్ధులు, యువతులు, బాలికలు "బతుకమ్మ"ల చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు. హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ పై గవర్నర్ సతీమణి జానకి, మంత్రి సీతక్క, మహిళా నేతలు, సీని జంట రష్మిక మండన్నా, విజయ దేవరకొండ ఇతర ప్రముఖులు బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఇక్కడి పరిసర ప్రాంతాలన్నీ మహిళలతో కిక్కిరిసి పోయింది. ఈ సందర్భంగా వాహనాల రాకపోలకు అంతరాయం ఏర్పడింది. ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు.మహిళల "బతుకమ్మ" ఆట,పాటలతో రాష్ట్రం అంతటా సాంస్కృతిక వైభవాన్ని చాటింది. ఆయా జిల్లాల కలెక్టరేట్ ఆవరణల్లో పూల పండగ వేడుకలు నిర్వహించారు.

గడ్డిఅన్నారం డివిజన్‌లో అంబరాన్నంటిన 'సద్దుల బతుకమ్మ' సంబరాలు -ఘనంగా జరిగిన వేడుకలు!"

ఎల్బీనగర్, అక్టోబర్ 19 ((డీకే చాటింపు) గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని వి.వి. నగర్ బస్ స్టాప్ సెంటర్లో వేలాదిగా తరలివచ్చిన మహిళా శక్తితో, పూల పరిమళాలతో, జానపద హోరుతో అంబరాన్నంటింది. గడ్డిఅన్నారం డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ భవాని ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన "సద్దుల బతుకమ్మ సంబరాలు" అత్యంత వైభవంగా, కన్నులపండువగా దిగ్విజయంగా ముగిశాయి.?ఈ చారిత్రాత్మక వేడుకకు గౌరవ ఎల్బీనగర్ శాసనసభ్యులు శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా విచ్చేసి డివిజన్ ప్రజలందరికీ హృదయపూర్వక సద్దుల బతుకమ్మ మరియు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. భవాని ప్రవీణ్ కుమార్ గారు ప్రతిఏటా ఈ వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహిస్తూ మన సంస్కృతిని కాపాడుతుండటం అభినందనీయమని ప్రశంసించారు...ప్రకృతిని దైవంగా భావించి, వివిధ రకాల సహజమైన పూలతో మహిళలు ఎంతో అందంగా బతుకమ్మలను అలంకరించి వి.వి. నగర్ బస్టాప్ కేంద్రానికి తీసుకువచ్చారు.[పముఖ గాయకులు శ్రీ జంగిరెడ్డి గారి ఆధ్వర్యంలో సాగిన జానపద ఆటపాటల కార్యక్రమం అందరిలో ఉత్సాహం నింపింది. జంగిరెడ్డి గారి పాటలకు అనుగుణంగా గడ్డిఅన్నారం డివిజన్ మహిళలు, ఆడపడుచులంతా కలిసిమెలిసి, ఐక్యతను చాటుతూ చప్పట్లు కొడుతూ, కోలాటాలు ఆడుతూ, బతుకమ్మ చుట్టూ తిరుగుతూ చేసిన నృత్యాలతో ప్రాంగణమంతా పండుగ వాతావరణం సంతరించుకుంది.?ఈ వేడుకలను మరింత ఉత్సాహపూరితంగా మార్చడానికి... అత్యంత అందంగా, కళాత్మకంగా బతుకమ్మలను పేర్చి తీసుకువచ్చిన మహిళలకు మరియు యువతులకు మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్ గారు ప్రత్యేక బహుమతులను అందజేసి ప్రోత్సహించా రు.అలాగే, ఈ కార్యక్రమానికి విచ్చేసిన డివిజన్ పెద్దలు, గౌరవనీయులను శాలువాలతో ఘనంగా



నత్కరించి, గౌరవ మర్యాదలు తెలిపారు.?ఈ బృహత్ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్ గారితో పాటు... డివిజన్‌లోని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు, మహిళా ప్రతినిధులు, యువజన విభాగం, విద్యార్థి విభాగం నాయకులు, కాలనీవాసులు, మరియు పెద్ద సంఖ్యలో మహిళలు, యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

రాష్ట్ర బీజేవైఎం అధికార ప్రతినిధిగా

భూతం సాయి రెడ్డి నియామకం

ఆర్మూర్ విలేఖరి, అక్టోబర్19 (డీకే చాటింపు): రాష్ట్ర బీజేవైఎం అధికార ప్రతినిధిగా ఆర్మూర్ నియోజక వర్గం ఉమ్మెడ గ్రామానికి చెందిన భూతం సాయి రెడ్డిని నియమిస్తూన్నట్లు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ప్రకటించారు. ఈ నియామక పత్రాన్ని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అందజేస్తు శాలువాతో సత్కరించి అభినందించారు. మండల అధ్యక్షుడి స్థాయి నుండి జిల్లా, రాష్ట్ర స్థాయి పదవికి ఎంపిక చేయడం పట్ల ఎంఎల్ఏ మరియు రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.కష్ట పడ్డ కార్యకర్తలకు కేవలం బీజేపీ పార్టీలో మాత్రమే ఉన్నత పదవులు గుర్తింపు రావడం జరుగుతుందని సాయిరెడ్డి అన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే రాకేష్ రెడ్డికి, ఎంపీ ధర్మపురి అరవింద్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ నాగ సురేష్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం చిన్నారెడ్డి, కిసాన్ మోర్చా నందిపేట్ మండల అధ్యక్షుడు సాయికుమార్, యువమోర్చా మండల ప్రెసిడెంట్ మంగులారపు



నవీన్, ఎస్సీ మోర్చా నందిపేట్ మండల ప్రెసిడెంట్ గంధం గంగాధర్, ఐలాపూర్ మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

రాక్ టౌన్ కాలనీలో అంగరంగ వైభవంగా

సద్దుల బతుకమ్మ సంబరాలు

- సుమారు 600 మంది మహిళలతో బతుకమ్మ సంబరాలు
-- బతుకమ్మ ఆటపాటలతో పాటు దాండియా సందడి..!!

ఎల్బీనగర్ (డీకే చాటింపు) రాక్ టౌన్ కాలనీలో సద్దుల బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుమారు 600 మంది మహిళలు పాల్గొని, రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, బతుకమ్మ ఆటపాటలతో పాటు దాండియా నృత్యాలతో ఎంతో ఉ త్సాహంగా, ఉల్లాసంగా సంబరాలను జరుపుకున్నారు. ఈ వేడుకల కోసం రాక్ టౌన్ అసోసియేషన్ అధ్యక్షులు ఎర్ర వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో అసోసియేషన్ కమిటీ సభ్యులు విస్తృత ఏర్పాట్లు చేసి, పండుగను ఘనంగా నిర్వహించారు. మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ నుంచి చివరి రోజు సద్దుల బతుకమ్మ వరకు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, సంప్రదాయ పద్ధతుల్లో బతుకమ్మ వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. బతుకమ్మ సంబరాల్లో భాగంగా మహిళా న్యాయనిర్ణేతల ఆధ్వర్యంలో అందంగా అలంకరించిన బతుకమ్మల్లో ఉత్తమమైన మూడు బతుకమ్మలను ఎంపిక చేసి, మొదటి, రెండవ, మూడవ బహుమతులను అందజేశారు. ఈ పోటీలు మహిళల్లో మరింత ఉత్సాహాన్ని నింపగా, విజేతలతో పాటు పాల్గొన్న మహిళలందరూ ఆనందోత్సాహాలతో వేడుకల్లో పాలుపంచుకు న్నారు. కాలనీలోని మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో, రంగురంగుల బతుకమ్మలతో, పాటలు పాడుతూ, దాండియా ఆడుతూ పండుగ వాతావరణాన్ని మరింత శోభాయమానంగా మార్చారు. చిన్నారులు, కాలనీ వాసులు సైతం ఈ వేడుకల్లో పాల్గొని సంబరాలకు మరింత కళ తీసుకొచ్చా రు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను కాలనీలోని మహిళలందరూ ఐకమత్యంతో, సంతోషంగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రాక్ టౌన్ అసోసియేషన్ అధ్యక్షులు





ఎర్ర వినోద్ రెడ్డి, అసోసియేషన్ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయుధ,వాహన పూజలు

-జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్...
-జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రీతి దంపతుల ప్రత్యేక పూజలు...

నారాయణపేట,(డీకే చాటింపు): విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఆర్మ్డ్ రిజర్వ్ విభాగంలో ఆయుధ పూజ,వాహన పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రీతి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి, జిల్లా ప్రజలకు విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని ఆర్మ్డ్ రిజర్వ్ విభాగంలో ఆయుధ పూజ నిర్వహించి, విధి నిర్వహణలో కీలక పాత్ర పోషించే ఆయుధాలకు సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు.శక్తికి,ధైర్యానికి, విజయానికి ప్రతీకగా నిలిచే దుర్గామాతను ప్రార్థిస్తూ, పోలీస్ సిబ్బంది ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో మరింత అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు.అలాగే పరేడ్ గ్రౌండ్లో వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజల భద్రత,నేరాల నియంత్రణ,శాంతిభద్రతల పరిరక్షణ,అత్యవసర సమయాల్లో సత్వర సేవలు అందించడంలో పోలీస్ వాహనాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ, ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని సూచించారు.విజయదశమి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ అని పేర్కొన్నారు.దుర్గామాత ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు, ఆయురారో గ్యాలు,శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.జిల్లా ప్రజలు విద్య,ఉద్యోగ,వ్యాపార, వ్యవసాయ తదితర అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ విజయపథంలో ముందుకు సాగాలని కోరుకున్నారు. ప్రజలందరూ



పరస్పర ప్రేమాభిమానాలతో, సోదరభావంతో పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని పిలుపునిచ్చారు. విజయదశమి పండుగ పోలీస్ సిబ్బందికి,వారి కుటుంబ సభ్యులకు కూడా సుఖసంతోషాలు,ఆరోగ్యం, విజయాలను అందించాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. ప్రజల సహకారంతో జిల్లాలో శాంతిభద్రతలను మరింత పటిష్టంగా కొనసాగిస్తూ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (డిఏఆర్)రియాజ్ హుల్ హక్,డీఎస్పీ నల్లపు లింగయ్య,ఆర్ఐ విజయ్ భాస్కర్,ఎస్ఐలు ఏ. వెంకటేశ్వర్లు,సునీత,శివ శంకర్,శిరీష,కృష్ణ చైతన్య, ఆర్మ్డు రిజర్వ్ పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 25న జడ్చర్లలోబ్రాహ్మణ శంకరారావం

-రాష్ట్ర నాయకులు కొల్లూరు భీంసేన్ రావ్...

నారాయణపేట,(డీకే చాటింపు): బ్రాహ్మణ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్రాహ్మణ శంకరారావం కార్యక్రమం ఈనెల 25న జడ్చర్ల వాసవి కళ్యాణ మండపంలో మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని ఆ సంఘం రాష్ట్ర నాయకులు కొల్లూర్ భీంసేన్ రావ్ తెలిపారు.సోమవారం. నారాయణపేట సుభాష్ రోడ్డు స్వామి శాంతానంద సభా మండపంలో జరిగిన విలేకరుల సమావేశములో నారాయణపేట జిల్లా బ్రాహ్మణ సంఘం పెద్దలు సంగ్వార్ గోపీనాథ్ రావ్, కంసాన్ పల్లి రఘునాథ్ రావ్, ఆయుర్వేద వైద్యులు ఉట్కూర్ విశ్వావసు పురోహిత్ తదితరులు పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ ఈ బ్రాహ్మణ శంఖారావం కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, బ్రాహ్మణ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు,బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాసు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని ఆయన తెలిపారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నాయకులు పెద్ద ఎత్తున హాజరవుతున్నట్లు భీంసేన్ రావ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి నారాయణపేట



జిల్లా నుంచి బ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని,ముఖ్యంగా బ్రాహ్మణ మహిళా సంఘం , భజనా మండలి సభ్యులు అందరూ పాల్గొని పేట జిల్లా బ్రాహ్మణ శక్తిని చాటాలని కోరారు.బ్రాహ్మణ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లాలోని బ్రాహ్మణులు అందరూ తరలి రావాలని కోరారు.

మక్తల్-నారాయణపేట రోడ్డు పనులు చేపట్టాలి

-ఉట్కూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి... -ఉట్కూరు గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలి... -మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి
వినతి... -జిల్లా కలెక్టర్ కు మూడు వినతి పత్రాలు...

నారాయణపేట,(డీకే చాటింపు): మక్తల్-నారాయణపేట రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని,ఉట్కూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని,ఉట్కూరు గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని కోరుతూ మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి సోమవారం జిల్లా కలెక్టరేట్లో అడిషనల్ కలెక్టర్ కు మూడు వినతి పత్రాలను అందజేశారు. మక్తల్-నారాయణపేట రోడ్డు పనులు చేపట్టాలి మక్తల్ నియోజకవర్గ కేంద్రం నుంచి నారాయణపేట జిల్లా కేంద్రానికి వెళ్ళే సుమారు 30 కి.మీ.రహదారి పూర్తిగా గుంతలమయమై అధ్వాన్నంగా మారింది.ఈ రోడ్డుపై ప్రయాణిస్తున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గుంతల కారణంగా ఇప్పటికే అనేక రోడ్డు ప్రమాదాలు జరిగి,చాలా మంది గాయపడటమే కాక, కొందరు ప్రాణాలు కూడా కోల్పోయారు.ఈ రోడ్డు నిర్మాణానికి గతంలో సీఎం ఒకసారి,మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మరోసారి శంకుస్థాపన చేసి వెళ్లారు. అలాగే మంత్రి సీతక్క తమ పర్యటన సందర్భంగా త్వరలోనే పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన నేటి వరకు పనులు ప్రారంభం కాలేదు.ఈ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని కోరారు.వెంటనే పనులు ప్రారంభించని యెడల బీఆర్ ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన ఆ వినితి పత్రంలో పేర్కొన్నారు. ఉట్కూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి ఉట్కూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని విన్నవించారు. ఎల్-నినో ప్రభావంతో ఈ ఏడాది ఉ ట్కూరు మండలంలోని అన్ని గ్రామాల్లో అతి తక్కువ వర్షపాతం నమోదైంది.సరైన సమయంలో వర్షాలు పడకపోవడంతో రైతులు వేసిన పంటలకు సరైన దిగుబడి రాక,పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. పెట్టుబడి కూడా చేతికి రాక రైతాంగం అప్పుల పాలై,తీవ్ర ఆందోళనలో ఉన్నారు.ఈ విపత్కర పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాలని కోరారు.ఉట్కూరు మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించి,పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి రూ. 10వేలు చొప్పున పంట నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి కోరారు.

ఉట్కూరు గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలి



నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉట్కూరు గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే కోరారు. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉట్కూరు చెరువును విస్తరించడానికి, కట్ట ఎత్తు పెంచడానికి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఒకవేళ ఉట్కూరు చెరువు విస్తీర్ణం పెంచి,కట్ట ఎత్తు పెంచినట్లయితే, భవిష్యత్తులో ఉట్కూరు గ్రామానికి ఊహించని ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.వర్షాకాలంలో గ్రామం మొత్తం నీట మునిగే, ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా మా నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎన్ని ఎకరాలకు సాగునీరు ఇస్తున్నారో,ఎన్ని చెరువులు నింపుతున్నారో మీరు ఇంతవరకు స్పష్టత ఇవ్వలేదు.కావున ఈ పథకం ద్వారా మక్తల్ నియోజకవర్గంలో ఎన్ని చెరువులు నింపుతున్నారో, ఎన్ని ఎకరాలకు నీళ్లు ఇస్తున్నారో శ్వేతపత్రం విడుదల చేయాలి. ఉట్కూరు గ్రామాన్ని వెంటనే ముంపు గ్రామంగా ప్రకటించాలని భారత రాష్ట్ర సమితి తరపున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంలో వెంటనే చర్యలు తీసుకోని యెడల భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసి, ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి తెలిపారు.

ఎస్‌బీఐలో 12,000 కొత్త ఉద్యోగాలు...

దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' (ఎస్‌బీఐ), ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారీ స్థాయిలో ఉద్యోగ నియామకాలు, నెట్‌వర్క్ విస్తరణ చేపడుతోంది. దాదాపు 12,000 మంది సిబ్బందిని కొత్తగా నియమించుకోవడంతో పాటు, దేశవ్యాప్తంగా 200-250 శాఖలను ప్రారంభించనున్నట్లు ఎస్‌బీఐ చైర్మన్ సి.శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. క్లరికల్, ఆఫీసర్ క్యాడర్లలో 11,000- 12,000 నియామకాలు చేపడతామని తెలిపారు. పదవీ విరమణలు, పెరుగుతున్న వ్యాపార అవసరాలకు అనుగుణంగా ఈ నియామకాలు ఉంటాయని తెలిపారు. 2026 మార్చి చివరికి ఎస్‌బీఐ ఉద్యోగుల సంఖ్య 2.45 లక్షలుగా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ 25,633 నియామకాలు చేపట్టింది. కొత్తగా ఏర్పడుతున్న నివాస ప్రాంతాలు, వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాల్లో బ్యాంకింగ్ సేవలు విస్తరిస్తామన్నారు. కొన్ని శాఖల హేతుబద్ధీకరణ అనంతరం, 2026-27లో నికరంగా 200-250 శాఖలు పెరగనున్నాయని ఎస్‌బీఐ చైర్మన్ చెప్పారు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) రూ. 30,000 కోట్ల ఐపీఓలో భాగంగా, ఆ సంస్థలో తమకున్న వాటాలో దాదాపు 1% వరకు ఎస్‌బీఐ గ్రూప్ విక్రయించనుంది. ఎన్ఎస్ఈలో ఎస్‌బీఐ 0.65% వాటాను, ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ 0.35% వాటాను తగ్గించుకోనున్నాయి. ప్రస్తుతం ఎన్ఎస్ఈలో ఎస్‌బీఐకి 3.23%, ఎస్‌బీఐ క్యాప్‌నకు 4.33% వాటాలున్నాయి.

క్లరికల్, ఆఫీసర్ క్యాడర్లలో 11,000- 12,000 నియామకాలు చేపడతామని తెలిపారు. పదవీ విరమణలు, పెరుగుతున్న వ్యాపార అవసరాలకు అనుగుణంగా ఈ నియామకాలు ఉంటాయని తెలిపారు. 2026 మార్చి చివరికి ఎస్‌బీఐ ఉద్యోగుల సంఖ్య 2.45 లక్షలుగా ఉంది. ప్రస్తుతానికి ఇతర అనుబంధ
సంస్థల్లో వాటాల విక్రయ ప్రణాళికలేవీ లేవని శెట్టి స్పష్టం చేశారు. ఈ ఏడాది జులైలో ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్‌లో దాదాపు 10% వాటాను విక్రయించి, రూ. 11,675 కోట్లు విజయవంతంగా సమీకరించినట్లు గుర్తు చేశారు.



నారాయణపేటలో దసరా ధమాకా...! -రద్దీగా మారిన ప్రధాన రోడ్లు... -గార్మెంట్స్,కిరాణం,సెల్ ఫోన్లు,జనరల్ తదితర దుకాణాల్లో విక్రయాల జోరు...

-నూతన సెల్ ఫోన్ల మోడల్ కొనుగోళ్లకు యువత ఆసక్తి... -తులం బంగారం ధర రూ. 1,50,600 లక్షలు... -మాసం బంగారం ధర రూ. 15,100... -బంతిపూలకు భలే డిమాండ్...











నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట జిల్లా కేంద్రంలో సోమవారం దసరా సందడి నెలకొంది.దసరా పండుగను పురస్కరించుకుని బంగారం, గార్మెంట్స్,బట్టల దుకాణాలు, కిరాణం,జనరల్,టీవీలు,సెల్ ఫోన్లు,పాదరక్షలు,వైన్స్, పండ్లు,పూలు,నూతన వాహనాల కొనుగోళ్లు జోరు అందుకున్నాయి.దసరా పండగ నేపథ్యంలో అన్ని రకాల దుకాణాల్లో కొనుగోలుదారుల నందడి కానవచ్చింది.ప్రధానంగా బంగారం,బట్టలు,కిరాణం, రెడీమేడ్,బట్టల దుకాణాలు ,జనరల్ తదితర దుకాణాల్లో దసరా సందడి అధికంగా కాన వచ్చింది.

బంగారు షాపులు...

నారాయణపేట మార్కెట్లో తులం బంగారం ధర రూ. 1,50,600 లక్షలు పలికింది. దసరా పండగ నేపథ్యంలో బంగారం కొనుగోళ్లు పెద్దగా జరగాలేదని వ్యాపారస్తులు పేర్కొన్నారు.పట్టణంలోని సరాఫ్ బజార్ వీధిలోని పలు బంగారు దుకాణాల్లో కొంతమేర గిరాకిలు కానవచ్చాయి.ప్రధానంగా

పండుగ నేపథ్యంలో కనీసం మాసం బంగారం అయిన ఖరీదు చేసేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తారు.మాసం బంగారం ధర రూ.15,100 పలికింది.ఆర్థికంగా ఉన్న కుటుంబాలు బంగారాన్ని కొనుగోలు చేసేందుకు ముందుకోచ్చాయి.దసరా సమయంలో పండుగకు ముందు రోజు,పండగ రోజున రెండు రోజుల పాటు బంగారు దుకాణాల్లో గిరాకి జరిగింది.తులం బంగారం ధర రూ.1,50,600 లక్షలు ఉండడంతో పలువురు తమ స్థాయిని బట్టి బంగారం కొనుగోళ్లు చేసినట్లు సమాచారం.బంగారం ధర అధికంగా ఉన్న నేపథ్యంలో కొనుగోళ్లపై ప్రభావం పడినట్లు సమాచారం.

కిటకిటలాడిన గార్మెంట్స్...

దసరా పండుగ నేపథ్యంలో ప్రతి ఒక్కరు కొత్త బట్టలను ధరించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా తమ ఇంటిల్లిపాదికి నూతన బట్టలను ఖరీదు చేసేందుకుమహిళలు,యువకులు, చిన్నారులు గుంపులు గుంపులుగా తరలిరావడంతో నారాయణపేట జిల్లా కేంద్రంలోని అన్ని బట్టల దుకాణాలు,గార్మెంట్స్ లో కొనుగోలుదారుల సందడి కానవచ్చింది.ఏ షాపుకి వెళ్లిన కొనుగోలుదారులతో కళకలాడాయి.యువత నూతన సెల్ ఫోన్ మోడల్స్ కొనుగోళ్లకు ఆసక్తి కనబరిచింది.దసరా పండుగ పర్వదినాన మంగళవారం శమీ పూజ(జమ్మి ఆకు) దసరా రోజు జమ్మి ఆకును బంధుమిత్రులకు ఇచ్చి బంగారంగా భావించి శుభాకాంక్షలు తెలుపుకోవడం మన సంప్రదాయం.ప్రతి ఒక్కరు నూతన వస్త్రాలను ధరించి తమ ఇష్టమైన దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి దసరా పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు.

కొనుగోళ్లు జోరు...

నారాయణపేట పరిసరాల గ్రామాలు,కర్ణాటకరాష్ట్రంలోని పలు గ్రామాలకు చెందిన పలువురు రైతులు సోమవారం బంతిపూలు, మామిడి ఆకులు,గుమ్మడి కాయలు,దిష్టి గుమ్మడి కాయలు,శమీ ఆకు కొమ్మలను నారాయణపేటకు తీసుకొచ్చి విక్రయించారు. బంతి పూలు కిలో ధర రూ. 50 నుంచి రూ.100వరకు పలికింది.గుమ్మడి కాయ ధర 100కు పైగా ఉంది.ఈ విధంగా అన్ని రకాల ధరలు ఆకాశాన్ని తాకాయని చెప్పవచ్చు.ప్రధానంగా వీధి వ్యాపారాలు పుంజుకున్నాయి.ప్రతి దుకాణం కొనుగోలుదారులతో కళకళ లాడుతున్నాయి.పట్టణంలో మెయిన్ రోడ్డు,పాత బస్టాండ్ ,సరాఫ్ బజార్,సెంటర్ చౌక్, నర్సిరెడ్డి చౌరస్తా తదితర ప్రాంతాల్లో దసరా సందడి కానవచ్చింది.ప్రధాన రహదారిపై క్రయవిక్రయదారులతో నిండుక పోయింది.



దసరా ఉత్సవాలకు ఉప్పల్ మున్సిపల్ స్టేడియం ముస్తాబు



మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా(డీకే చాటింపు): దసరా పండుగ ఉత్సవాలకు ఉప్పల్ మున్సిపల్ స్టేడియం ముస్తాబవుతోంది. ఉప్పల్ దసరా ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలకు భారీ స్థాయిలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉత్సవాల ఏర్పాట్లను పరమేశ్వర్ రెడ్డితోపాటు సమితి సభ్యులు నాగరాజు, ఆంజనేయులు, శేఖర్, సంతోష్, మురళీకృష్ణ, అమర్, సత్యం, మహిపాల్, నాని, జిత్తు, బంటి తదితరులు సోమవారం పరిశీలించారు. మంగళవారం సాయంత్రం ఆరున్నర గంటలకు జమ్మి పూజ, రావణ దహనంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. భక్తులు, ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయ దశమి ఉత్సవాలను విజయవంతం చేయాలని పరమేశ్వర్ రెడ్డి కోరారు.

ఈనెల 22న పండుగ సాయన్న ముదిరాజ్ 174వ, జయంతి వేడుకలు

-నారాయణపేటలో గోడపత్రిక ఆవిష్కరణ...



నారాయణపేట,(డీకే చాటింపు): తెలంగాణ రాబిన్ హుడ్, ప్రజా వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ 174 వ, జయంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ఈనెల 22 న నిర్వహిస్తున్నట్లు నారాయణపేట జిల్లా ముదిరాజ్ సంఘం నేతలు తెలిపారు.ఇందుకు సంబంధించిన గొడ పత్రికను సోమవారం నారాయణపేట సిటీజన్ క్లబ్ ఆవరణలో ఆవిష్కరించారు .ఈనెల 22న రాష్ట్రస్థాయిలో హైదరాబాద్ రవింద్ర భారతిలో వేడుకలు, అలాగే జిల్లా స్థాయిలో కలెక్టర్ కార్యాలయంలో,ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముదిరాజ్ లు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.మంత్రి వాకిటి శ్రీహరి కృషి,మన జిల్లా వాసి ముఖ్యమంత్రిగా ఉండటం వల్ల వారికి ముందునుండే పండుగ సాయన్న జీవిత చరిత్ర తెలిసి ఉండటం వల్ల ఇదిసాధ్యమైందని అన్నారు. సీఎం ఎ.రేవంత్ రెడ్డి,మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ లకు యావత్తు ముదిరాజ్ ల తరపున పత్రిక ముఖంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజ్,జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు ఎ.కాంత్ కుమార్,ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షుడు బి.వెంకటయ్య, ముదిరాజ్ సంఘం యువత అధ్యక్షులు ఎ.రాము,ఆకుల బాలప్ప,కాకర్ల భీమయ్య, కొనంగేరి హన్మంతు,గొవింద్ గేరి లక్ష్మి కాంత్,పాండు, నర్సింహ,కె.జనర్దన్,ప్రవిన్, తదితరులు పాల్గొన్నారు. ముదిరాజ్ పెద్దలు, ముదిరాజ్ నాయకులు, ముదిరాజ్ యువత, ముదిరాజ్ సభ్యులు పండుగ సాయన్న 174 వ జయంతి వేడుకల్లో కచ్చితంగా మీకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో విధిగా హాజరుకావాలని కోరారు.

పోలీసు పరేడ్ గ్రౌండ్ లో చండీ యాగ హోమం



నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 19 (డీకే చాటింపు): పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో సోమవారం చండీయాగ హోమం ఘనంగా నిర్వహించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్లో ఏర్పాటు చేసినటు వంటి దుర్గా పరమేశ్వరి మాత నవరాత్రి ఉత్సవాలలో భాగముగా చండీయాగ హోమం లో పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పాల్గొన్నారు. హోమం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది . హోమం కార్యక్రమం యందు నిజామాబాద్ అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్ , అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) భుజంగ రావ్ , అదనపు కలెక్టర్ (యు.టి) పి. సురేష్ , డిఎం అండ్ హెచ్ ఓ రాజశ్రీ , మరియు నిజామాబాద్, ఎ.ఆర్ ఎ.సి.పి లు , సీఐలు , రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు , ఎస్సైలు ఆర్.ఎస్.ఐ లు తదితరులు పాల్గొనడం జరిగింది.

బిజెపిని ఓడించడమే లక్ష్యం సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ

న్యూఢిల్లీ : రానున్న ఉత్తరప్రదేశ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి, సంఘ్‌పరివార్‌ను ఓడించడమే సిపిఎం లక్ష్యమని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ స్పష్టం చేశారు. జంతర్‌మంతర్ విద్యార్థి ఉద్యమంతో పాటు దేశవ్యాప్తంగా జరుగుతున్న ప్రజా ఉద్యమాల ప్రభావం రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కనిపిస్తుందని ఆయన తెలిపారు.

సిపిఎం కేంద్ర కార్యాలయం (ఎకెజి భవన్)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఎ బేబీ మాట్లాడారు. రెండు రోజుల పాటు జరిగిన సిపిఎం పొలిట్ బ్యూరో సమావేశం వివరాలను వెల్లడించారు. బిజెపి, సంఘ్‌పరివార్ శక్తులను ఓడించేందుకు ప్రజాస్వామ్య, లౌకిక శక్తుల ఐక్యతను బలోపేతం చేయడమే పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పంజాబ్‌లో బిజెపిని ఓడించే అవకాశాలు అత్యధికంగా ఉన్న అభ్యర్థికి సిపిఎం మద్దతు ఇస్తుందని తెలిపారు.



ఈ అంశంపై పంజాబ్ రాష్ట్ర కమిటీ ఇప్పటికే సమగ్రంగా చర్చించిందని, అవసరమైన నిర్ణయాలు తీసుకుంటుందని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోనూ బిజెపిని ఓడించేందుకు సిపిఎం పనిచేస్తుందని తెలిపారు.

త్వరలో హర్మూజ్‌లో 'ఎక్స్‌క్లూజన్ జోన్' ఏర్పాటు..



అమెరికాతో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో హర్మూజ్ జలసంధిపై ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ జలసంధి సమీపంలో కొత్తగా ఓ 'ఎక్స్‌క్లూజన్ జోన్' (నిషేధిత ప్రాంతం) ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ప్రాంతంలోకి ప్రవేశించే ఏ నౌకపైన అయినా కఠిన ఆంక్షలు విధిస్తామని స్పష్టం చేసింది.

ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మొహ్సెన్ రెజాయీ ప్రభుత్వ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వివరాలు వెల్లడించారు. రాబోయే కొద్ది రోజుల్లో లేదా వారాల్లో ఈ జోన్‌ను అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు. అమెరికా నేవీ ఏర్పాటు చేసిన బ్లాకేడ్ లైన్ నుంచి ప్రారంభమై, హర్మూజ్ జలసంధి మీదుగా పర్షియన్ గల్ఫ్‌లోకి ఈ జోన్ విస్తరించి ఉంటుందని వివరించారు.

ఈ ప్రాంతంలోకి వచ్చే నౌకలను ఇరాన్ ఆంక్షల జాబితాలో చేర్చుతామని, ఇది వాటి ఇన్సూరెన్స్, భవిష్యత్ ప్రయాణాలపై ప్రభావం చూపుతుందని ఆయన హెచ్చరించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ "హర్మూజ్ తెరిచే ఉంది" అని చెప్పడం ఓ "పెద్ద అబద్ధం" అని రెజాయీ కొట్టిపారేశారు. గతంలో రోజుకు 100కు పైగా నౌకలు ప్రయాణించే ఈ మార్గంలో, ఇప్పుడు కేవలం 7-8 నౌకలు మాత్రమే (అదీ ఇరాన్‌కు అవసరమైనవి) వెళ్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

కేసీఆర్ భూముల వివాదం చంద్రబాబు జపం

హైదరాబాద్: రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా కేసీఆర్ భూములపై సమగ్ర విచారణ చేపడుతామని స్పష్టమైన ప్రకటన చేసిన తర్వాత, తెలంగాణ రాజకీయాల్లో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ భూముల వివాదంలో పూర్తిగా ఇరుక్కుపోయిన గులాబీ పార్టీ, ఆ ఉచ్చు నుంచి బయటపడేందుకు సరికొత్త సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగించాలని చూస్తున్నదన్న వాదన రాజకీయ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. ముఖ్యంగా కేసీఆర్, కేటీఆర్ ఫామ్ హౌజ్ భూములు, వాటి కేటాయింపులపై పెద్దఎత్తున చర్చ జరుగుతుండటంతో, ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీఆర్ఎస్ నాయకులు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారన్న చర్చ జరుగుతోంది.అయితే, ప్రధానంగా కేసీఆర్ , కేటీఆర్ భూముల చుట్టూ వివాదం నడుస్తున్నప్పటికీ, బీఆర్ఎస్ మాత్రం పూర్తిగా చంద్రబాబు జపం వైపు మళ్లడం గమనార్హం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా నీళ్లు వదిలేస్తున్నారని, గురుదక్షిణ కింద తెలంగాణ హక్కులను తాకట్టు పెడుతున్నారని కేటీఆర్, హరీష్ రావు, జగదీశ్వర్ రెడ్డి వంటి సీనియర్ నేతలందరూ ఒకే గళంతో తీవ్ర ఆరోపణలు గుప్పిస్తున్నారు.



సైబర్ నేరాలపై జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి - జిల్లా ఎస్పీ తుషార్ డూడి

చిత్తూరు : జిల్లా పరిధిలో సైబర్ నేరాల నియంత్రణ, ప్రజల్లో అవగాహన కల్పించడం, సైబర్ మోసాల బారిన పడిన బాధితులకు సకాలంలో సహాయం అందించేందుకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం చర్యలు చేపడుతోందని జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఒక ప్రకటనలో తెలిపారు.16-09-2025 నుండి 15-09-2026 వరకు చిత్తూరు జిల్లా పరిధిలోని నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఔఅఖీఖ) ద్వారా మొత్తం 1,608 ఫిర్యాదులు నమోదయ్యాయి. పోలీసుల తక్షణ చర్యల ఫలితంగా సైబర్ మోసాలకు సంబంధించిన రూ.4,01,57,226/- నగదును హోల్డ్ చేయడం జరిగింది. అందులో ఇప్పటివరకు రూ.2,15,60,922/- నగదును బాధితులకు రీఫండ్ చేయడం జరిగింది.ఈ సందర్భముగా జిల్లా ఎస్పీ శ్రీ తుషార్ డూడి, ఎఖూ గారుమాట్లాడుతూ... సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారు. అత్యాశ, భయం, అత్యవసర పరిస్థితి వంటి అంశాలను ఆసరాగా చేసుకుని బాధితుల నుంచి నగదు దోచుకుంటున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటం ద్వారా ఇటువంటి మోసాలను చాలా వరకు నివారించవచ్చు."బ్యాంకు అధికారులు, పోలీసు అధికారులు, ప్రభుత్వ సంస్థల పేరుతో ఫోన్ చేసి ూఖ, ఖఎజొ, అఎఎ, యఓ వివరాలు, బ్యాంక్ ఖాతా వివరాలు లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని ఎవరైనా అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వకూడదని జిల్లా ఎస్పీ గారు సూచించారు.

అలాగే, డిజిటల్ అరెస్ట్, ఐజఅ అప్‌డేట్, ఉద్యోగాలు, పెట్టుబడులు, రివార్డులు,లోన్‌లు, ట్రేడింగ్,ఆన్‌లైన్ గేమింగ్, ఫేక్ కస్టమర్ కేర్, సోషల్ మీడియా మోసాలు వంటి సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.సైబర్ మోసం జరిగిన వెంటనే ఉనీశ్రీటవని ఊనీబీతీ అత్యంత కీలకం. మోసం జరిగిన తర్వాత తొలి గంటలోనే 1930కు సమాచారం అందించి, సంబంధిత బ్యాంకు లావాదేవీలను నిలిపివేయడానికి చర్యలు ప్రారంభించే అవకాశం ఉంటుంది. ప్రతి నిమిషం విలువైనదే కాబట్టి ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. అలాగే లిలిలి.ఇఎఎవతీఇతీతిఎవ.ణనీల.తిని (ఔజీబితినీనిజీశ్రీ అఎఎవతీ అతీతిఎవ ఖీవజూనీతీబితినిణ ఖనీతీబిజీశ్రీ) ద్వారా వెంటనే ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. మోసం జరిగిన తొలి గంటల్లోనే సమాచారం అందించడం ద్వారా మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.

ఆరోపణలు... ప్రత్యారోపణలు డీఎస్సీకి కథ ముగింపు ఎప్పుడు



విజయవాడ : ఏపీ ప్రభుత్వం ఎంత ఓపికగా, పారదర్శకంగా వివరణలిస్తున్న కొద్దీ.. వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి వర్గం ఉద్దేశపూర్వకంగానే నిరాధార ఆరోపణల రాళ్లు విసురుతోంది. ప్రభుత్వం ఇస్తున్న ప్రతి సమాచారానికి వాస్తవాలతో కూడిన రివర్స్ కౌంటర్లు వస్తున్నాయని, తాము లేవనెత్తుతున్న అంశాలన్నీ గాల్లో దీపాలేనని ఆ పార్టీ నాయకులకు కూడా బాగా తెలుసు. అయినప్పటికీ ప్రజల్లో ఏదో ఒక అభూతకల్పనను నిరంతరం సజీవంగా ఉంచాలనే దుర్బుద్ధితో జగన్ రెడ్డి అండ్ కో ఈ తప్పుడు ప్రచారాలను నిరంతరం కొనసాగిస్తూనే ఉంది. కేవలం తమ అబద్ధాలను పదే పదే ప్రచారం చేసుకుంటూ కాలం వెళ్లదీయడమే లక్ష్యం.ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోతే తాము ఆడే డ్రామాలే నిజమని జనం నమ్ముతారనే భయంతో, ప్రభుత్వం ప్రతి చిన్న అంశానికీ ఆధారాలతో సహా వివరంగా సమాధానమిస్తోంది. అయితే దీన్ని తమకు అనుకూలంగా మలుచుకుంటున్న వైసీపీ, అదే అలుసుగా తీసుకుని ప్రతి దానిని డీఎస్సీ స్కాం అంటూ ప్రజల మైండ్‌లో రుద్దడానికి సర్వశక్తులూ ఒడ్డుతోంది. ప్రజా సమస్యలపై సద్విమర్శలు చేయడం మానేసి, కేవలం నిరుద్యోగుల ఆశలతో ఆడుకునేలా నిత్యం ఏదో ఒక వివాదాన్ని రగిలించడమే ఏకైక అజెండాగా మార్చుకుంది.ఈ కుట్రపూరిత ప్రచారంలో భాగంగా మొదట పేపర్ లీక్ అంటూ నానా హంగామా సృష్టించారు; కానీ అది ఎక్కడా నిలవకపోవడంతో వెంటనే యూటర్న్ తీసుకుని ఒకే కులానికి చెందినవారికి ఉద్యోగాలొచ్చాయంటూ' విషం చిమ్మారు. ఆ విమర్శ కూడా పటాపంచలు కావడంతో, ఇప్పుడు ఏకంగా స్పోర్ట్స్ కోటా అంశాన్ని పట్టుకుని వేలాడుతున్నారు. అసలు ఖోఖో కూడా ఒక ఆట కింద లెక్కేనా అంటూ జగన్ రెడ్డి స్వయంగా ఎద్దేవా చేయడం, క్రీడాకారుల ప్రతిభను కించపరిచేలా మాట్లాడటం చూస్తుంటే.. వినేవాళ్లు నవాబుల కాలం నాటి ఈ జోకులను ఎందుకు సీరియస్‌గా తీసుకోవాలో అర్థం కాని దుస్థితి ఏర్పడింది. కేవలం తమ రాజకీయ మనుగడ కోసం రాష్ట్రంలోని క్రీడాకారుల భవిష్యత్తును, పారదర్శకంగా భర్తీయవుతున్న ఉపాధ్యాయ నియామకాలను బలిపెట్టడానికి కూడాఆ పార్టీ వెనుకాడటం లేదు.వైసీపీ ఆడుతున్న ఈ విషపూరిత డ్రామాలు, పన్నే ప్లాన్లకు ప్రభుత్వం ఇకనైనా పూర్తిస్థాయిలోచెక్ పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. రోజువారీ రాజకీయ మైలేజ్ కోసం చేస్తున్న ఈ ఆరోపణలను ఎక్కడికక్కడ చట్టపరంగా, కఠినంగా నిలువరించాల్సిన అవసరం ఉంది. కేవలం మీడియా చర్చలకు వదిలేయకుండా, కోర్టుల్లో ఏమాత్రం నిలవని, కేవలం బురద జల్లే ఈ నకిలీ డిబేట్లను తక్షణం న్యాయపరమైన చర్యలతో అడ్డుకోవాలి. లేదంటే ఈ అబద్ధాల ప్రచారమే నిజమనే భ్రమను కల్పించడంలో వారు సఫలమయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వం తన పాలనా దక్షతను, పారదర్శకతను చాటుకుంటూనే.. వ్యవస్థలను అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్న ఈ పాత రాజకీయ శైలిని ఉక్కుపాదంతో అణచివేయాలి. నిరుద్యోగుల ఉసురుపోసుకునేలా రోజుకో డ్రామా ఆడుతున్న వైసీపీకి ప్రజాక్షేత్రంలోనూ, చట్టం ముందూ తగిన బుద్ధి చెప్పినప్పుడే ఇలాంటి నిరాధార రాళ్ల క్రీడలకు శాశ్వత బ్రేక్ పడుతుంది.

అడ్డగోలు విద్యా సంస్థలపై యాక్షన్ షురూ

గుంటూరు, : ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులను పావులుగా వాడుకుంటూ ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నిస్తున్న కొన్ని ప్రైవేటు కోచింగ్ కేంద్రాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాబుద్ధులు నేర్పి, పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయాల్సిన సంస్థలు రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులను రోడ్లపైకి ఎక్కించి ఆందోళనలు, నిరసనలు చేయిస్తుండటంపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇలాంటి అవాంఛనీయ చర్యలకు పాల్పడుతున్న నిర్వాహకులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.పోటీ పరీక్షల అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇప్పటికే తెచ్చిన ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల నియంత్రణ నిబంధనలు 2026 , జీవో నెంబర్ 9 మార్గదర్శకాలకు అనుగుణంగానే ప్రతి ప్రైవేటు కోచింగ్ సెంటర్ నడుచుకోవాల్సి ఉంటుంది. అయితే, నిబంధనలను బేఖాతరు చేస్తూ కొన్ని సంస్థల యజమానులు తెరవెనుక రాజకీయ వ్యవహారాలు నడుపుతున్నట్లు నిఘా వర్గాల పరిశీలనలో తేలింది. సంస్థలలో చేరిన అభ్యర్థులపై మానసిక ఒత్తిడి తెచ్చి, వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసేలా ప్రేరేపిస్తున్నారని సీఎం దృష్టికి వచ్చింది.కొన్ని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అభ్యర్థులను ఉద్దేశపూర్వకంగా ఆందోళనలకు పురిగొల్పుతున్నారని ప్రభుత్వం తేల్చింది. కెరీర్ నిర్మించుకోవాల్సిన అమూల్యమైన సమయంలో విద్యార్థులను రాజకీయ ప్రేరేపిత నిరసనల్లో భాగస్వాములను చేయడం తీవ్రమైన నేరమని ప్రభుత్వం హెచ్చరించింది. నిబంధనలను ఉల్లంఘించి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే సంస్థల గుర్తింపు రద్దు చేయడంతో పాటు, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.విద్యార్థులు, నిరుద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా కట్టుబడి ఉందని, వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం పునరుద్ఘాటించింది. అయితే ప్రైవేటు కోచింగ్ సెంటర్ల ముసుగులో రాజకీయ కుట్రలు పన్నుతూ వ్యవస్థలను అస్థిరపరచాలని చూస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. నిబంధనల పరిధిలోనే సంస్థలు కార్యకలాపాలు సాగించాలని, విద్యా వాతావరణాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను ఉక్కుపాదంతో అణచివేస్తామని హెచ్చరించింది.

వారసుల కోసమే సీనియర్ల ప్రయత్నాలు

శ్రీకాకుళం: ఉత్తరాంధ్ర రాజకీయాల్లో వైఎస్ఆర్‌సీపీ ఖాళీ అవుతోందన్న సంకేతాలు రోజురోజుకూ మరింత బలపడుతున్నాయి. గత సార్వత్రిక ఎన్నికల ఘోర పరాభవం తర్వాత ఉనికి కోల్పోతున్న వైఎస్ఆర్‌సీపీలో కొనసాగడం తమ రాజకీయ భవిష్యత్తుకే కాకుండా, తమ వారసుల అరంగేట్రానికి కూడా ముప్పు అని సీనియర్ నేతలు గ్రహించినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగానే విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు తన కుమార్తె సిరి సహస్రతో సహా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. ఈ ఒక్క ఘటన ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని వైఎస్ఆర్‌సీపీ అగ్రనేతలకు ఒక స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లయింది.ప్రస్తుతం ఉత్తరాంధ్రకు చెందిన పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ద్వితీయ శ్రేణి కీలక నేతలు టీడీపీ, జనసేన అధిష్టానాలతో తీవ్రంగా చర్చలు జరుపుతున్నారు. ఈ వలసల వెనుక ఉన్న ప్రధాన రాజకీయ కారణం రాబోయే మహిళా రిజర్వేషన్లు, వారసత్వ రాజకీయం . 2029 నాటికి చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలుకావడం ఖాయమని తేలడంతో పాటు, ఇటీవల టీడీపీ మహానాడులో మంత్రి నారా లోకేష్ బిల్లు పాస్ కాకపోయినా పార్టీ తరఫున మహిళలకు 33% టికెట్లు కేటాయిస్తామని సంచలన ప్రకటన చేశారు. దీంతో తమ కుమార్తెలను లేదా కోడళ్లను రాజకీయ బరిలోకి దించాలనుకుంటున్న సీనియర్ నాయకులకు కూటమి పార్టీలే సురక్షితమైన, ఆశాజనకమైన వేదికలుగా కనిపిస్తున్నాయి.వైఎస్ఆ ర్‌సీపీ జెండాపై పోటీ చేస్తే భవిష్యత్తులో గెలిచే అవకాశాలు శూన్యమని, తమ వారసుల రాజకీయ జీవితాలు ప్రారంభంలోనే దెబ్బతింటాయని ఈ సీనియర్లు భావిస్తున్నారు. అందుకే, చిన్న శ్రీను తన కుమార్తెను జెడ్పీ చైర్‌పర్సన్‌గా నిలబెట్టే ముందస్తు వ్యూహంతో టీడీపీ పసుపు కండువా కప్పుకున్నట్లే..



మిగిలిన ముగ్గురు ఉమ్మడి జిల్లాల నేతలు కూడా తమ మహిళా వారసులను స్థానిక సంస్థలు, రాబోయే అసెంబ్లీ స్థానాలకు స్థిరపరచేందుకు కూటమి నేతలతో రాయబారాలు నెరుపుతున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం వైపు నుంచి కూడా ఈ వలసలకు గ్రీన్ సిగ్నల్ లభిస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఉత్తరాంధ్ర వ్యాప్తంగా ఏకపక్ష విజయాలు సాధించి, ప్రతిపక్షాన్ని క్షేత్రస్థాయి నుంచి పూర్తిగా తుడిచిపెట్టాలనేది కూటమి వ్యూహం.

బలమైన ఓటు బ్యాంక్, సామాజిక వర్గ సమీకరణాలు ఉన్న వైఎస్ఆర్‌సీపీ సీనియర్ల వారసులను చేర్చుకోవడం ద్వారా తమ గెలుపు అవకాశాలను మరింత సుగమం చేసుకోవచ్చని టీడీపీ-జనసేన వర్గాలు లెక్కిస్తున్నాయి. ఉత్తరాంధ్రలో వైఎస్ఆర్‌సీపీ ఒక రకమైన శూన్యతలోకి జారుకుంటోందనడంలో ఎలాంటి సందేహం లేదు. అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఖరి, పార్టీ పునర్నిర్మాణంలో కొరవడిన దిశానిర్దేశం వల్ల విసిగిపోయిన నేతలు.. తమ వారసుల భవిష్యత్తును కాపాడుకునేందుకు పవర్ అండ్ ఫ్యూచర్ ఉన్న కూటమి వైపే మొగ్గు చూపుతున్నారు. రాబోయే స్థానిక పోరు నాటికి ఉత్తరాంధ్ర వైఎస్ఆర్‌సీపీ నుంచి మరిన్ని వికెట్లు పడటం, వారసుల రాజకీయ రంగానికి కూటమి వేదికగా మారడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.

మండుతున్న కూరగాయల ధరలు



విజయవాడ, : సామాన్యులపై నిత్యావసర సరుకుల భారం పడుతోంది. ఇప్పటికే షుగర్ ధరలు పెరగ్గా.. ఇప్పుడు కూరగాయల ధరలు కూడా పెరుగుతున్నాయి. గత కొద్ది రోజులుగా ఉల్లిపాయల ధరలు ఘాటెక్కిస్తున్నాయి. ధరలు ఒక్కసారిగా కొండెక్కాయి. కొద్ది రోజుల క్రితం కిలో ఉల్లి రూ.20కే లభించగా.. ఇప్పుడు ఏకంగా రూ.60కి చేరుకుంది. కొద్ది రోజుల వ్యవధిలోనే రూ.40 పెరగడం సామాన్యులకు భారమనే చెప్పవచ్చు. ఎల్‌నీవో ప్రభావంతో పంట ఉత్పత్తి లేకపోవడం, తెగుళ్లు, ఇతర కారణాల వల్ల డిమాండ్‌కు తగ్గట్లు సరఫరా లేకపోవడంతో ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ధరలు ఇలాగే కొనసాగే అవకాశముందని, రానున్న రోజుల్లో పెరిగే అవకాశముందని అంచనాలు వేస్తున్నారు. కిలో ఉల్లి రూ.100కి చేరుకున్నా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. గతంలో పలుమార్లు ఉల్లి సెంచరీ కొట్టింది. ఇప్పుడు కూడా అదే తరహాలో పరిస్థితులు రానున్నాయని అంటున్నారు. దీంతో సామాన్యులు ఉల్లిని చూస్తే బెంబేలెత్తిపోతున్నారు. హైదరాబాద్‌లోని రైతు బజార్లలో ఉల్లిపాయల ధరలు పెరిగాయి. నగరంలోని రైతు బజార్లలో కిలో ఉల్లి రూ.54 పలుకుతోంది. ఇక కిలో టమాట రూ.17. వంగ రూ.28, బెండకాయ రూ.35, పచ్చిమిర్చి రూ.40, క్యాలీఫ్లవర్ రూ.21, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.50, దొండకాయ రూ.35, ఆలు రూ.17, సొరకాయ రూ.9, పొట్లకాయ రూ.15, బీన్స్ రూ.60, గోరుచిక్కుడు రూ.28, చిక్కుడుకాయ రూ.40, దోసకాయ రూ.28, బీరకాయ రూ.32, కాకరకాయ రూ.32, చామగడ్డ రూ.28, కీరదోస రూ.40, క్యాప్సికం రూ.41, బీట్ రూట్ రూ.35, కందగడ్డ రూ.35, చిలగడదుంప రూ.35, మామిడి రూ.45, మునగ రూ.45 పలుకుతోంది.విజయవాడలో కిలో ఉల్లి రూ. 55కు లభిస్తున్నాయి. ఇక వంకాయలు రూ.22, టమాటా రూ.26, బెండకాయ రూ.18, పచ్చిమిర్చి రూ.30, కాకర రూ.32, బీర రూ.30, క్యాలీఫ్లవర్ రూ.35, క్యాబేజీ రూ.24, క్యారెట్ రూ.48, దొండకాయ రూ.24, బంగాళదుంప రూ.24, గోరుచిక్కుళ్లు రూ.28, దోస రూ.22, పొట్లకాయ రూ.13, చామదుంప రూ.34 పలుకుతున్నాయి.అయితే రైతు బజార్లలో ధరలు ఇలా ఉండగా.. రిటైల్ మార్కె?ట్లలో కిలో ఉల్లి రూ.70కి విక్రయిస్తున్నారు. పంట దిగుబడి తగ్గడం, మార్కెట్లో సరఫరా లేకపోవడంతో ఉల్లి ధరలు పెరుగుతున్నట్లు చెబుతున్నారు. జులైలో రోడ్ల పక్కన ట్రాలీ ఆటోల్లో రూ.100కు 4 కిలోల ఉల్లి ఇవ్వగా.. ఇప్పుడు ట్రాలీ వాహనాల్లో కూడా రూ.200కి 3 కిలోల చొప్పున అందిస్తున్నారు. అయితే ఏపీ ప్రభుత్వం సామాన్యులకు ఉల్లి ధరల నుంచి ఉపశమనం కలిగించే ప్రయత్నం చేస్తోంది. అందులో భాగంగా రైతు బజార్లలో రూ.35కే కిలో చొప్పును అందిస్తోంది. అటు కేంద్రం కూడా రంగంలోకి దిగింది. ధరల స్థిరీకరణ నిధి ద్వారా 1 లక్షా 21 వేల టన్నుల బఫర్ స్టాక్ అందుబాటులోకి తెచ్చింది. మరోవైపు వ్యాపారులు కృత్తిమ కొరతను సృష్టించి డబ్బులు సొమ్ము చేసుకుంటున్నారు. హైదరాబాద్‌లోని మలక్ పేట్ మార్కట్లో క్వింటా ఉల్లి రూ.5500 పలుకుతోంది. అటు దేశవ్యాప్తంగా కూడా ధరలు పెరిగాయి

మళ్లీ గుడ్ మార్నింగ్ అంటున్న కేతిరెడ్డి

అనంతపురం, : ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి.. గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించారు. ఎన్నికల్లో ఓటమి అనంతరం ఈ కార్యక్రమానికి కేతిరెడ్డి దూరంగా ఉన్నారు. అయితే సోమవారం ఉదయం.. పట్టణంలోని చేనేత ఇళ్ల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల లబ్ధి అందుతోందా లేదా అనేది వాకబు చేశారు. త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. ప్రజల్లోకి వెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని మళ్లీ ప్రారంభించారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి .. తెలుగు రాజకీయాలపై అవగాహన ఉన్నవారికి పరిచయం అక్కర్లేని పేరు. గుడ్ మార్నింగ్ ధర్మవరం అంటే సోషల్ మీడియా యూజర్లకు కూడా చిరపరిచితమే. ఉదయాన్నే ప్రతి ఇంటి గడపనూ పలకరిస్తూ.. వారి సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి గతంలో గుడ్ మార్నింగ్ ధర్మవరం పేరుతో కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కేతిరెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమం.. సోషల్ మీడియాలో సూపర్ హిట్ అయ్యింది. పొరుగు రాష్ట్రాల లోనూ.. ఆయన ఫాలోయింగ్ పెరిగింది. అయితే 2024 ఎన్నికల్లో ఊహించని రీతిలో ఓటమి పాలయ్యారు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి. ఆ తర్వాత గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహించలేదు.అయితే ఇన్ని రోజుల తర్వాత ఇప్పుడు మళ్లీ గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమాన్ని కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తిరిగి ప్రారంభించారు. సోమవారం ఉదయం గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమం చేపట్టిన కేతిరెడ్డి.. చేనేత కార్మికుల ఇళ్ల వద్దకు వెళ్లి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన నేతన్న సేవలో పథకం కింద రూ.25000 ఆర్థిక సహాయం అందిందా



లేదా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేతన్న సేవలో డబ్బులు చేనేతల హక్కు అని.. రాకుంటే ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికలు వస్తున్నాయనే కారణంతోనే ప్రభుత్వం పింఛన్లు, నేతన్న సేవలో పథకం అంటూ హడావిడి చేస్తోందని కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి విమర్శించారు.అయితే ఎన్నికల్లో ఓటమి తర్వాత గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమానికి కేతిరెడ్డి దూరమయ్యారు. ఆ తర్వాత వైసీపీ తరుఫున ప్రభుత్వ తీరును ఎండగడుతూ అనేక నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టారు. అయితే ఇప్పుడు మళ్లీ గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమం ప్రారంభించడానికి.. స్థానిక సంస్థల ఎన్నికలు కారణం కావొచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవాలు జరగకూడదని.. అలాంటివి జరిగితే ఇంచార్జిలకు సీట్లు ఇవ్వమంటూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ కీలక ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రకటన ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలను తానెంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందీ శ్రేణులకు జగన్ స్పష్టంచేశారు. ఈ క్రమంలోనే కేతిరెడ్డి మళ్లీ గుడ్ మార్నింగ్ ధర్మవరం బాట పట్టినట్లు భావిస్తున్నారు. అయితే ఈ కార్యక్రమం రోజూ కొనసాగుతుందా.. వారంలో ఒకరోజా అనే విషయాలపై క్లారిటీ రావాల్సి ఉంది.

ఆర్థిక రాజధానిగా విశాఖ

విశాఖపట్టణం, : విశాఖపట్నం భవిష్యత్‌లో మరింత వేగంగా విస్తరించే అవకాశాలున్న నగరంగా మారుతోంది. ఐటీ రంగం, డేటా సెంటర్లు (, పరిశ్రమలు, పర్యాటకం, వాణిజ్య కార్యకలాపాలు పెరుగుతున్న కొద్దీ నగరానికి వచ్చే ప్రజల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది. మిట్టల్ స్టీల్ ప్లాంట్ వంటి భారీ పారిశ్రామిక ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే ఉపాధి అవకాశాలు పెరిగి ఇతర ప్రాంతాల నుంచి కూడా ప్రజలు నగరానికి వచ్చే పరిస్థితి ఏర్పడవచ్చు. దీంతో రాబోయే సంవత్సరాల్లో విశాఖ జనాభా గణనీయంగా పెరిగే అవకాశం ఉందనే అంచనాలు వినిపిస్తున్నాయి.జనాభా పెరుగుదలతో పాటు నగర మౌలిక సదుపాయాలను కూడా అదే స్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంటుంది. ముఖ్యంగా రవాణా, విద్యుత్, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు సరిపడా నీటి లభ్యత వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి. ప్రస్తుతం ఉన్న నీటి వనరులతో భవిష్యత్ అవసరాలను తీర్చడం కష్టమయ్యే అవకాశం ఉన్నందున ముందుగానే దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.ఈ విషయంలో సింగపూర్) అనుసరిస్తున్న నీటి నిర్వహణ విధానాలను ఉదాహరణగా తీసుకోవచ్చనే అభిప్రాయం ఉంది. సహజ నీటి వనరులు పరిమితంగా ఉన్న సింగపూర్.. వర్షపు నీటిని సేకరించడం, ఉపయోగించిన నీటిని శుద్ధి చేసి మళ్లీ వినియోగించడం, సముద్రపు నీటిని డీశాలినేషన్ చేయడం వంటి పద్ధతులను విస్తృతంగా ఉపయోగిస్తోంది. ముఖ్యంగా నీటి పునర్వినియోగం సముద్రపు నీటిని తాగునీటిగా మార్చే సాంకేతికత ద్వారా అక్కడ నీటి అవసరాల్లో గణనీయమైన భాగాన్ని సమకూర్చుకుంటున్నారు. ఈ విధానం విశాఖకు కూడా ఉపయోగపడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.విశాఖ చుట్టుపక్కల ఉన్న రిజర్వాయర్లు కూడా నగర నీటి అవసరాలకు ముఖ్యమైన వనరులే. వాటిలో పూడిక తొలగించడం, సామర్థ్యాన్ని పెంచడం, ఆధునిక నిర్వహణ పద్ధతులు అమలు చేయడం ద్వారా నిల్వ సామర్థ్యాన్ని మెరుగుపరచవచ్చని సూచిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న వనరులను సమర్థంగా ఉపయోగించుకోవడంతో పాటు కొత్త నీటి వనరులపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందిపోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరిజలాలను విశాఖకు తీసుకురావడం కూడా భవిష్యత్ నీటి అవసరాలకు ఉపయోగపడే అంశంగా భావిస్తున్నారు. ఈ నీటిని నిల్వ చేసేందుకు నగరం చుట్టూ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. అదే సమయంలో సముద్రం అందుబాటులో ఉన్నందున పెద్ద స్థాయిలో డీశాలినేషన్ ప్లాంట్లు ఏర్పాటు చేసే అవకాశాన్ని కూడా పరిశీలించవచ్చు.తాగునీరు, పరిశ్రమలు, భవిష్యత్ జనాభా అవసరాలను ఒకే ప్రణాళికలోకి తీసుకువచ్చి సమగ్ర వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తే నీటి సరఫరాను మరింత సమర్థంగా నిర్వహించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. వర్షపు నీటి సంరక్షణ, రీసైక్లింగ్, రిజర్వాయర్ల ఆధునీకరణ, గోదావరి జలాల వినియోగం, డీశాలినేషన్ వంటి మార్గాలను కలిపి ముందుకు తీసుకెళ్లగలిగితే విశాఖ భవిష్యత్ నీటి అవసరాలకు ముందుగానే సిద్ధమయ్యే అవకాశం ఉంటుంది.

కవిత సమరశంఖం..



హైదరాబాద్, : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ లో కవిత సమర శంఖం పూరించారు. ఆదివారం కొడంగల్ వేదికగా జరిగిన పాంచ జన్య సంకల్ప సభలో కవిత ఓపెన్ గా మాట్లాడారు. ఎటువంటి ఫిల్టర్లు లేకుండా తన అభిప్రాయాన్ని.. మొహమాటం లేకుండా చెప్పేశారు.నేను వాళ్ళు వదిలిన బాణం.. వీళ్ళు వదిన బాణం కాదు. అలాంటి తలకాయ లేని మాటలు మాట్లాడను. అలాంటి వారి కోసం నేను కొడంగల్ గడ్డమీద నుంచి చెబుతున్న. ఇప్పటికీ అధికారానికి.. విద్యకు దూరంగా ఉన్న మా బహుజనుల బాణాన్ని నేను. యువకుల యుద్ద నినాదాన్ని నేను. వారికోసం మోడీతో కొట్లాడుతా. రేవంత్ రెడ్డితో కొట్లాడుతా. చివరికి కేసీఆర్ తో నైనా కొట్లాడుతా. తద్వారా తన మీద వస్తున్న విమర్శలకు ఈ స్థాయిలో కవిత సమాధానం చెప్పారు. అంతేకాదు తనమీద అవాకులు చవాకులు పేరుతున్న గులాబీ పార్టీ సోషల్ మీడియా.. ఆ పార్టీ అనుబంధ సోషల్ మీడియా గ్రూపులకు కవిత గట్టిగానే కౌంటర్ ఇచ్చారు.వాస్తవానికి కవిత పాంచ జన్య సభలో గట్టిగా మాట్లాడారు. ఒక రకంగా దీనిని ఎన్నికల సభ లాగా ఆమె చాలెంజ్ గా తీసుకొని ప్రసంగించారు.. ప్రారంభం నుంచి చివరి దాకా బహుజనుల విషయాలను ప్రస్తావించారు. తన తండ్రి పరిపాలన కాలంలో తెలంగాణ రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో మార్పు రాలేదని. ముఖ్యంగా విద్య.. వైద్యం.. ఇతర వాటిల్లో వృద్ధి కనిపించలేదని కవిత క్లారిటీ ఇచ్చారు. విద్య.. వైద్యం వంటివి తమ ప్రధమ ప్రాధాన్యాలు అని కవిత క్లారిటీ ఇచ్చారు. అక్కడితోనే ఆగిపోలేదు.. ఇంకా చాలా విషయాలను కవిత ఈ సభలో చెప్పారు. తన తండ్రి పరిపాలన కాలంలో జరిగిన అవినీతిని.. అక్రమాలను.. తనను బయటికి పంపించిన విధానాన్ని ఆమె వివరించారు.ఇటీవల తన అత్తగారిల్లు అయిన నిజామాబాదులో పాంచ జన్య సభను నిర్వహించిన కవిత.. అక్కడ కన్నీళ్లు పెట్టుకున్నారు. సభలో మాట్లాడుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. కొడంగల్ లో మాత్రం ధైర్యంగా మాట్లాడారు. ప్రభుత్వం మీద ఆరోపణలు చేసిన ఆమె.. చివరికి తన తండ్రిని కూడా వదిలిపెట్టలేదు. అన్నిటికంటే ముఖ్యంగా గులాబీ పార్టీ సోషల్ మీడియాకు దిమ్మతిరిగిపోయేలాగా కవిత రిప్లై ఇచ్చింది. ఒక రకంగా దానిని స్లిప్పర్ షాట్ అని చెప్పవచ్చు. కొద్దిరోజులుగా గులాబీ పార్టీ సోషల్ మీడియా కవిత మీద వ్యక్తిగతంగా దాడి చేసే స్థాయిలో విమర్శలు చేస్తోంది. ఆ విమర్శలకు కవిత ఏర్పాటుచేసిన సోషల్ మీడియా గ్రూపులలో కౌంటర్ ఇస్తున్నప్పటికీ.. గులాబీ పార్టీ సోషల్ మీడియా ఆగడం లేదు. అందువల్లే కొడంగల్ సభ నుంచి కవిత గట్టిగా రిప్లై ఇచ్చారు. మరి దీనికి గులాబీ పార్టీ సోషల్ మీడియా ఎలాంటి కౌంటర్ ఇస్తుందో చూడాలి.

గ్రాడ్యుయేట్ ఎన్నికల కోసం కసరత్తు షురూ



హైదరాబాద్, : తెలంగాణ రాష్ట్రంలో మరో ఆసక్తికరమైన రాజకీయ పోరుకు రణభేరి మోగింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ మరియు వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల పదవీకాలం మార్చి 2027తో ముగియనుండటంతో, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అధికారికంగా కొత్త ఓటర్ల జాబితా షెడ్యూల్‌ను విడుదల చేశారు. ప్రస్తుత సభ్యులైన సురభి వాణిదేవి , తీన్మార్ మల్లన్న ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ రెండు స్థానాల్లో ఎన్నికల కసరత్తు షురూ కావడంతో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్, సీనియర్ పట్టభద్రుల పట్టున్న బీజేపీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా వ్యూహాలకు పదును పెడుతున్నారు.ఈ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన మైలురాయి.. సెప్టెంబర్ 28న విడుదల కానున్న పబ్లిక్ నోటీస్, ఫారం-18 ద్వారా ఓటర్ల నమోదు ప్రారంభం కావడం. గతంలో ఎంతమంది ఓటర్లు నమోదై ఉన్నప్పటికీ, గ్రాడ్యుయేట్ స్థానాల నిబంధనల ప్రకారం పాత ఓటర్ల జాబితా రద్దవుతుంది. ప్రతిసారి కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందే. నవంబర్ 6 వరకు ఫారం-18 స్వీకరించి, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. అంటే, దాదాపు 7 లక్షల మందికి పైగా ఉండే అవకాశం ఉన్న పట్టభద్రుల ఓట్లలో.. ఎవరు ఎక్కువ మంది నిజమైన మద్దతుదారులను ఫారం-18 నింపి ఓటర్లుగా నమోదు చేయించగలుగుతారో, వారికే పోలింగ్ రోజు సగం విజయం ఖాయమవుతుంది.ఈసారి పట్టభద్రుల సమరం చతుర్ముఖ పోటీని తలపిస్తోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగ నియామకాలు, జాబ్ క్యాలెండర్, డీఏ, పెన్షన్ అంశాలను ప్రధాన ప్రచారాస్త్రాలుగా మార్చుకుని నిరుద్యోగులు, ఉద్యోగుల ఓట్లను ఆకర్షించేందుకు ప్లాన్ చేస్తోంది. తమ బలాన్ని నిరూపించుకోవడానికి కాంగ్రెస్ యంత్రాంగం క్షేత్రస్థాయి వరకు ఫారం-18 దరఖాస్తులను చేరవేసి రికార్డు స్థాయిలో ఓటర్లను నమోదు చేయించే పనిలో పడింది. అటు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీకి ఇది అతిపెద్ద అగ్నిపరీక్ష. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల తర్వాత గ్రాడ్యుయేట్ వర్గాల్లో ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ అమలులో జాప్యం వంటి అంశాలను లేవనెత్తి విద్యావంతులను తమ వైపు తిప్పుకోవాలని చూస్తోంది. గతంలో గెలిచిన మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ సీటును నిలబెట్టుకోవడంతో పాటు నల్గొండ-వరంగల్-ఖమ్మంలోనూ బలమైన పోటీ ఇచ్చేందుకు కేటీఆర్, హరీష్ రావులు ప్రత్యేకంగా టీమ్‌లను ఏర్పాటు చేసి ఓటర్ల నమోదు బాధ్యతలను స్థానిక నేతలకు అప్పగిస్తున్నారు.మరోవైపు హైదరాబాద్, రంగారెడ్డి మరియు నల్గొండ పట్టభద్రుల స్థానాల్లో బీజేపీకి సంప్రదాయంగా బలమైన ఓటు బ్యాంకు ఉంది.

విద్యావంతులు, ఐటీ నిపుణులు, ఆర్ఎస్ఎస్ అనుబంధ వర్గాల్లో ఆ పార్టీకి మంచి పట్టు ఉంది. కేంద్రంలో అధికారంలో ఉన్న మైలేజ్‌తో పాటు రాష్ట్ర సర్కార్ వైఫల్యాలను ఎండగడుతూ అర్బన్ ప్రాంతాల్లో అత్యధికంగా ఆన్‌లైన్ ద్వారా ఓట్లను నమోదు చేయించే వ్యూహంతో బీజేపీ సమాయత్తమవుతోంది. దీనికి తోడు తీన్మార్ మల్లన్న, ఇతర స్వతంత్ర, యువజన సంఘాల నాయకులు కూడా బరిలోకి దిగుతుండటంతో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు అత్యంత ఉత్కంఠభరితంగా మారనుంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయానికి 'అభ్యర్థి ఇమేజ్' ఎంత ముఖ్యమో.. 'ఓటర్ల నమోదు డిజైన్' అంతకంటే వెయ్యింతలు ముఖ్యం. డిగ్రీ సర్టిఫికేట్లు సేకరించి, గెజిటెడ్ అటెస్టేషన్ చేయించి, గడువులోగా ఫారం-18 అధికారులకు చేరేలా ఏ పార్టీ యంత్రాంగం నెట్‌వర్క్‌ను పక్కాగా నడుపుతుందో.. ఆ పార్టీయే మార్చి 2027 పట్టభద్రుల పోరులో విజేతగా నిలుస్తుంది.

థియేటర్ల బిజినెస్ లోకి మెగా ఫ్యామిలీ!



హైదరాబాద్, : టాలీవుడ్ టాప్ హీరోలలో కొంత మంది థియేటర్ బిజినెస్‌లో అడుగు పెట్టారు. తమ పేరుతో మల్టీప్లెక్స్‌లు కట్టారు. సూపర్ స్టార్ మహేష్ బాబుకు 'ఏఎంబీ', ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఏమో 'ఏఏఏ', మాస్ మహారాజా రవితేజ 'ఏఆర్‌టీ' అంటూ ప్రేక్షకులకు మంచి థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వడానికి మల్టీప్లెక్స్‌లు కట్టారు. అల్లు ఫ్యామిలీ కోకాపేట్‌లో 'అల్లు సినిమాస్' నిర్మించింది. ఇప్పుడు ఈ లిస్టులో మెగాస్టార్ చిరంజీవి అడుగు పెడుతున్నారు. గ్రాండ్ ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అయ్యారు.హీరోలు అందరితో మల్టీప్లెక్స్ వ్యాపారంలో భాగస్వామిగా ఉన్న ఏసియన్ సినిమాస్ సంస్థతోచిరంజీవి కూడా థియేటర్ వ్యాపారంలో అడుగు పెట్టేందుకు రెడీ అయ్యారు. ప్రపంచంలోనే అత్యంత భారీ సినిమా స్క్రీన్‌ను హైదరాబాద్ సిటీలో ఏర్పాటు చేయడానికి రెడీ అవుతున్నారు.

అమెరికాలోని జార్జియా రాష్ట్రంలోని పూలర్ ప్రాంతంలో ఉన్న 'రాయల్ సినిమాస్ 14 ఐమాక్స్ డ్యూయల్ లేజర్' స్క్రీన్ ప్రస్తుతానికి ప్రపంచంలోనే అతి పెద్ద స్క్రీన్. ఆ రికార్డు దాని పేరిట ఉంది. ఆ స్క్రీన్ 101 అడుగుల వెడల్పు, 76.2 అడుగుల ఎత్తుతో ఉంటుంది. ఆ థియేటర్ దాదాపు 7,696 చదరపు అడుగుల భారీ వైశాల్యంలో విస్తరించి ఉంది. అంతే కాదు...

ఆ థియేటర్‌లో 363 రెక్లైనర్ సీట్లు ఉన్నాయి. హైదరాబాద్‌లో అంత కంటే పెద్ద స్క్రీన్ ఏర్పాటు చేయడానికి చిరంజీవి – ఏసియన్ సినిమాస్ సంస్థ రెడీ అవుతోందని సమాచారం. సేమ్ అటువంటి స్క్రీన్ లేదంటే దాని కంటే ఒక్క ఇంచ్ ఎక్కువ ఉన్న స్క్రీన్ ఏర్పాటుకు సన్నాహాలు మొదలు అయ్యాయి.చిరంజీవి – ఏసియన్ సినిమాస్ సంస్థ భాగస్వామ్యంలో ఏర్పాటు కాబోయే స్క్రీన్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో అధికారికంగా వెల్లడించనున్నారు. అది గనుక రెడీ అయితే... ఇండియాలో మాత్రమే కాదు, ప్రపంచంలో హైదరాబాద్ సిటీకి ప్రత్యేక గుర్తింపు వస్తుంది.

నల్లేరు మీద నడక అవుతుందా...?



హైదరాబాద్, : తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లారు దానం నాగేందర్. అయితే ఆయన మొదట సుప్రీంకోర్టుకు వెళ్లనని ఖైరతాబాద్ ఉపఎన్నికను నేరుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. కానీ ఓ చాయిస్ ఉన్నప్పుడు ఎందుకు వదులుకోవడం ఆయన పిటిషన్ వేశారు కానీ..సుప్రీంకోర్టులో ఊరట లభించడం కష్టమేనన్న అభిప్రాయంబలంగా ఉంది. చట్టపరంగా అనర్హత వేటు పడినప్పటికీ, తదుపరి జరిగే ఉపఎన్నికలో పోటీ చేయకుండా నిరోధించే నిబంధన ఏదీ లేదు కాబట్టి దానం నాగేందర్ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగడం దాదాపు ఖాయమైంది. ఈ పరిణామంతో ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉపఎన్నిక అనివార్యం కాగా, ఇక్కడ రాజకీయ పరిస్థితులు పూర్తిగా దానం నాగేందర్ చుట్టూనే తిరుగుతున్నాయి. ఖైరతాబాద్ నియోజకవర్గ చరిత్రను పరిశీలిస్తే.. పార్టీల సిద్ధాంతాల కంటే దానం నాగేందర్ వ్యక్తిగత ప్రభావమే ఇక్కడ ఎక్కువ పనిచేస్తుందని స్పష్టమవుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఏవైనా సరే.. నియోజకవర్గంలోని ప్రతి బస్తీ, డివిజన్ స్థాయి నేతలతో ఆయనకు దశాబ్దాలుగా ఉన్న ప్రత్యక్ష పరిచయాలు, బలమైన అనుచరగణమే ఆయన ప్రధాన బలం. ఖైరతాబాద్‌లో ప్రత్యేకంగా ఏ ప్రతిపక్ష పార్టీకి బలమైన సంస్థాగత క్యాడర్ నిర్మాణం లేకపోవడంతో, దానం నెట్‌వర్క్ ప్రధాన శక్తిగా నిలుస్తోంది. ఇక పార్టీల సమీకరణాల పరంగా చూస్తే, అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఖైరతాబాద్‌తో సంప్రదాయబద్ధంగా పాత ఓటుబ్యాంకు ఉంది. దానం నాగేందర్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీకి దిగినప్పుడు.. ఆయన వ్యక్తిగత ఇమేజ్, బస్తీల్లో ఉన్న పట్టుకు తోడు కాంగ్రెస్ పార్టీ సంప్రదాయ ఓటుబ్యాంకు, శ్రేణులు ఏకమవుతాయి. దీనికి తోడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ యంత్రాంగం, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల హోదా తోడవటం దానం నాగేందర్‌కు ఉపఎన్నికలో భారీ అడ్వాంటేజ్‌గా మారే అవకాశం ఉందనేది పొలిటికల్ ట్రెండ్స్ చెబుతున్నాయి.ఈ పరిస్థితి ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు అతిపెద్ద సవాలుగా మారింది. ఖైరతాబాద్‌లో స్థానికంగా దానం స్థాయి బలమైన, నియోజకవర్గమంతా తెలిసి ఉన్న ప్రత్యామ్నాయ నాయకుడు బీఆర్ఎస్‌కు లేకపోవడం పెద్ద లోటు. గతంలో దానంను నమ్ముకునే అక్కడ బీఆర్ఎస్ రాజకీయం నడిచింది. ఇప్పుడు ఆయననే ఎదుర్కొని నిలబడటానికి బలమైన లోకల్ క్యాడర్, సమర్థుడైన అభ్యర్థి దొరకడం గులాబీ పార్టీకి కత్తిమీద సాము లాంటిదే. ప్రభుత్వ బలం, దానం పర్సనల్ క్యాడర్‌ను తట్టుకుని పోరాడటం బీఆర్ఎస్‌కు అంత తేలికైన విషయం కాదుమరోవైపు భారతీయ జనతా పార్టీ పరిస్థితి కూడా ఇక్కడ ఏమంత ఆశాజనకంగా లేదు.

గతంలో తెలుగుదేశం పార్టీ తో పొత్తు ఉన్న సమయంలో మాత్రమే బీజేపీ ఈ నియోజకవర్గంలో విజయం సాధించగలిగింది. ఆ తర్వాత ఒంటరిగా పోటీ చేసిన ప్రతిసారి డిపాజిట్ కోల్పోవడం లేదా నామమాత్రపు ఓట్లకే పరిమితమవ్వడం జరిగింది.

నగర పరిధిలో ఉనికి ఉన్నప్పటికీ, ఖైరతాబాద్‌లోని స్థానిక బస్తీ ఓటర్లను ఆకట్టుకునే స్థాయి బలమైన కేడర్ గానీ, అభ్యర్థి గానీ బీజేపీకి కూడా పెద్దగా అందుబాటులో లేరు. ఖైరతాబాద్ ఉపఎన్నిక అనివార్యమైన వేళ, మిగిలిన ప్రతిపక్ష పార్టీల వద్ద గట్టి అభ్యర్థులు, బలమైన క్యాడర్ లేకపోవడం దానం నాగేందర్‌కు ప్లస్ పాయింట్‌గా మారుతోంది. చట్టపరమైన తీర్పు దానంకు ప్రతికూలంగా వచ్చినా, ప్రజాక్షేత్రంలో మాత్రం అధికార పార్టీ బలం, తన సొంత ఇమేజ్, స్థానిక బస్తీ ఓటర్ల మద్దతుతో ఆయన మరోసారి విజయం సాధించే అవకాశాలే మెండుగా ఉన్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

సింగిల్ విండో అనుమతులు కోసం యత్నాలు

హైదరాబాద్, : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ , నూతన హెచ్ఎండీఏ పరిధిలో భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్ అప్రూవల్స్ ప్రక్రియను మరింత సరళతరం చేయాలని రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన ప్రముఖ అసోసియేషన్లు ప్రభుత్వాన్ని గట్టిగా కోరుతున్నాయి. ప్రస్తుతం వివిధ విభాగాల నుంచి ఎన్ఓసీలు పొందడంలో జరుగుతున్న జాప్యం, వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా ప్రాజెక్ట్‌ల నిర్మాణం ఆలస్యమవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో అక్రమాలను అరికడుతూ, పూర్తి పారదర్శకతతో కూడిన సేవలు అందించేందుకు ఒక సమగ్ర సింగిల్ విండో వ్యవస్థను తక్షణమే అమల్లోకి తేవాలని డిమాండ్ చేస్తూ వస్తున్నాయి.ప్రస్తుతం అమల్లో ఉన్న ఆన్‌లైన్ అనుమతుల విధానం కొన్ని వెసులుబాట్లు కల్పిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇంకా అనేక సాంకేతిక , అధికారిక ఇబ్బందులు వేధిస్తున్నట్లు డెవలపర్లు వాపోతున్నారు. ఫైళ్లు వివిధ శాఖల చుట్టూ తిరగడం వల్ల వడ్డీ భారం పెరిగి, చివరికి అది ఇళ్ల కొనుగోలుదారులపై అదనపు ఆర్థిక భారంగా మారుతోందని నిపుణులు చెబుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా అన్ని రకాల క్లియరెన్స్‌లను ఒకే గొడుగు కిందకు తెచ్చే సరికొత్త సింగిల్ విండో విధానం అత్యవసరమని రియల్ ఎస్టేట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.ఈ ప్రతిపాదిత సింగిల్ విండో వ్యవస్థ ద్వారా దరఖాస్తు చేసుకున్న నిర్దిష్ట కాలపరిమితిలోగా అన్ని అనుమతులు మంజూరయ్యేలా నిబంధనలు రూపొందించాలని కోరుతున్నారు. ఫైర్ సేఫ్టీ, రెవెన్యూ, అటవీ, పర్యావరణం , స్థానిక పట్టణాభివృద్ధి సంస్థల నుంచి వేర్వేరుగా అనుమతులు తెచ్చుకునే నరకయాతన తప్పుతుందని, దీనివల్ల చిన్న , మధ్యతరగతి బిల్డర్లకు ఎంతో ఊరట లభిస్తుందని పేర్కొంటున్నారు. పారదర్శకత పెరిగితే ప్రభుత్వానికి వచ్చే ఆదాయంతో పాటు వినియోగదారులకు కూడా సరసమైన ధరల్లో గృహాలు లభించే అవకాశం ఉంటుందని వాదిస్తున్నారు.తెలంగాణ ప్రభుత్వం, సంబంధిత పురపాలక శాఖ ఈ డిమాండ్లపై సానుకూలంగా స్పందించి, రియల్ ఎస్టేట్ రంగానికి మరింత ఊతమిచ్చేలా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ నగర బ్రాండ్ ఇమేజ్ వేగంగా మారుతున్న తరుణంలో, మౌలిక సదుపాయాల కల్పనలో , అనుమతుల జారీలో ఈ రకమైన ఆధునిక సంస్కరణలు ఎంతైనా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వం కనుక సింగిల్ విండో విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తే, దేశవ్యాప్తంగా ఉన్న పెద్ద ఇన్వెస్టర్లు మరెన్నో ప్రాజెక్ట్‌లతో భాగ్యనగరం వైపు క్యూ కట్టే అవకాశం ఉంది.

ఖైరతాబాద్ నుంచి సాయికిరణ్..!



హైదరాబాద్, : తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఖైరతాబాద్ నియోజకవర్గం ఉపఎన్నిక వ్యవహారం కీలక చర్చనీయాంశంగా మారింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించిన దానం నాగేందర్.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లో చేరారు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజక వర్గానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. పార్టీ మారిన ఆయనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించాలని బీఆర్ఎస్ న్యాయ పోరాటం చేసింది. చివరకు ఆయనపై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేస్తూ తీర్పు ఇచ్చింది.హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇవాళ లేదంటే రేపు సుప్రీంకోర్టులో తీర్పు వచ్చే అవకాశం ఉంది. అయితే, హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పలువురు న్యాయనిపుణులు పేర్కొంటున్నారు. అదే జరిగితే ఖైరతాబాద్ ఉపఎన్నిక అనివార్యమైనట్లే. ఇప్పటికే బీఆర్ఎస్ అధిష్టానం ఖైరతాబాద్ నియోజకవర్గంపై దృష్టిసారించింది. ఉపఎన్నిక వస్తే బరిలో ఎవరిని నిలపాలనే అంశంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యనేతలతో చర్చించినట్లు సమాచారంఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో విజయం సాధించి అధికార కాంగ్రెస్ పార్టీకి గట్టి షాక్ ఇవ్వాలని బీఆర్ఎస్ భావిస్తోంది. ఈ క్రమంలో అభ్యర్థి ఎంపికపై ఆచితూచి అడుగులు వేయాలని గులాబీ పార్టీ అధిష్టానం డిసైడ్ అయింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌లో ఖైరతాబాద్ టికెట్ ఆశిస్తున్న నేతలు.. ఎవరి ప్రయత్నాల్లో వాళ్లు బిజీ అయిపోయారు. ప్రముఖంగా పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మన్నె గోవర్ధన్ రెడ్డి, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తనయుడు సాయికిరణ్ యాదవ్ పేర్లు వినిపిస్తున్నాయి. అయితే, సాయికిరణ్ యాదవ్‌ను బరిలోకి దింపాలనే ఆలోచనలో బీఆర్ఎస్ అధిష్టానం ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో అభ్యర్థి ఎంపికపై కేసీఆర్ పార్టీ ముఖ్యనేతలతో చర్చించినట్లు సమాచారం. ఈ క్రమంలో తసాని శ్రీనివాస్ యాదవ్ కుమారుడు సాయి కిరణ్ కు టికెట్ ఇవ్వాలని కేసీఆర్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తసాని శ్రీనివాస్ యాదవ్ కు ఫోన్ చేసి ఖైరతాబాద్ ఉప ఎన్నికలో సాయికిరణ్ ను పోటీకి పెట్టేందుకు సిద్ధం కావాలని కేసీఆర్ సూచించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతుంది. సాయికిరణ్ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత జరిగిన తొలి లోక్ సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యాడు. గత ఎన్నికల్లోనూ అదే పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయాలని భావించినప్పటికీ.. చివరి నిమిషంలో అధిష్టానం ఆ స్థానం నుంచి పద్మారావుగౌడ్ ను బరిలోకి దింపింది. అయితే, తలసాని శ్రీనివాస్ యాదవ్ కు ఖైరతాబాద్ నియోజకవర్గంలో గట్టి పట్టుంది. మంత్రిగా ఈ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనుల్లో తలసాని కీలకంగా వ్యవహరించడం కలిసి వస్తుందని బీఆర్ఎస్ అధిష్టానం భావిస్తోంది. దీనికితోడు తలసాని సామాజిక వర్గంకు చెందిన ఓటర్లతోపాటు ఇతర బీసీ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు ఈ నియోజకవర్గంలో ఎక్కువగా ఉండటంతోపాటు.. వీరిలో ఎక్కువశాతం తలసాని కుటుంబానికి సానుకూలంగా ఉండటంతో బీఆర్ఎస్ అధిష్టానం సాయికిరణ్‌ను బరిలోకి దింపేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

ఇండియా నుంచి భారత్

హైదరాబాద్, : దేశ రాజకీయాల్లో కొన్ని నాయకత్వాలు ఎన్నికల విజయాలతో గుర్తుండిపోతాయి. మరికొన్ని నాయకత్వాలు పాలనా విధానాల్లో, ప్రజల ఆలోచనా ధోరణిలో తీసుకొచ్చిన మార్పులతో చరిత్రలో నిలిచిపోతాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలిస్తే.. రెండో కోణం కూడా స్పష్టంగా కనిపిస్తుంది. ప్రధాని పదవి అంటే కేవలం ప్రభుత్వాన్ని నడపడం మాత్రమే కాదనే భావనను మోదీ తన పనితీరుతో ముందుకు తెచ్చారు. ప్రభుత్వ కార్యక్రమాలు, దేశ పర్యటనలు, సమీక్షలు, అంతర్జాతీయ సమావేశాలు, ప్రజా కార్యక్రమాలు.. ఇలా నిరంతర కార్యకలాపాలతో ఆయన రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తున్నారు. వ్యక్తిగత ఆరోగ్యంపై పెద్దగా చర్చకు తావివ్వకుండా విధులకు ప్రాధాన్యం ఇవ్వడం ఆయన నాయకత్వ శైలిలో కనిపించే అంశం.మోదీ పాలనలో మరో ముఖ్యమైన అంశం.. సంప్రదాయ రాజకీయాలను అభివృద్ధి, సంక్షేమం, సామాజిక మార్పుతో అనుసంధానం చేయడం. స్వచ్ఛ భారత్, యోగా, పర్యావరణ పరిరక్షణ, డిజిటల్ సాంకేతికత, పేదల కోసం వివిధ సంక్షేమ కార్యక్రమాలు వంటి అంశాలను ప్రభుత్వ కార్యక్రమాలుగా మాత్రమే కాకుండా ప్రజా ఉద్యమాలుగా మలిచేందుకు ప్రయత్నించారు. ప్రజల భాగస్వామ్యంతోనే దేశ ప్రగతి సాధ్యమనే సందేశాన్ని పదేపదే ముందుకు తెచ్చారు.దేశ ప్రయోజనమే ముందన్న భావనను ప్రజల్లో బలపరచడం కూడా మోదీ రాజకీయ శైలిలోని ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

వ్యక్తి కంటే దేశం, రాజకీయాల కంటే జాతీయ ప్రయోజనం, హక్కులతో పాటు బాధ్యతలు అనే అంశాలను ఆయన ప్రసంగాల్లోనూ, కార్యక్రమాల్లోనూ ప్రస్తావిస్తూ వచ్చారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో కనిపించిన దేశభక్తి, జాతీయ పునర్నిర్మాణ స్ఫూర్తిని కొత్త తరానికి పరిచయం చేసే ప్రయత్నం కూడా ఇందులో భాగమే.'ఇండియా' నుంచి 'భారత్' వైపు సాగుతున్న చర్చ కూడా ఈ మారుతున్న ఆలోచనా ధోరణికి ఒక ప్రతీకగా మారింది. ఇది కేవలం పేరుకు సంబంధించిన మార్పు కాదు.. దేశపు సాంస్కృతిక మూలాలు, చారిత్రక వారసత్వం, భారతీయ జీవన విధానంపై పెరుగుతున్న దృష్టికి ప్రతిబింబంగా చూడవచ్చు. ఈ పరివర్తనలో మోదీ నాయకత్వం ఒక ముఖ్యమైన పాత్ర పోషించిందనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.

అమృతం 'చెరకు రసం'..

డీహైడ్రేషన్ కు చెక్ పెట్టాలంటే ఇది తాగాల్సిందే!



వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు పెరిగే కొద్దీ శరీరాన్ని చల్లబరచేందుకు చాలా మంది సహజంగానే చల్లని పానీయాలవైపు మొగ్గు చూపుతారు. నిమ్మరసం (నింబూ పానీ), చల్లని లస్సీలు వంటి సంప్రదాయ పానీయాలు తక్షణ ఉపశమనం ఇస్తాయని భావిస్తారు. ఈ జాబితాలో చెరకు రసం (షుగర్‌కేన్ జ్యూస్) కూడా ప్రముఖంగా ఉంటుంది. ఇది సహజంగా తీయగా, తాజాగా అనిపించడంతోపాటు శరీరాన్ని చల్లబరుస్తుందని చాలామంది నమ్మకం. అయితే తీవ్రమైన ఎండలో ఇది నిజంగా హీట్ స్ట్రోక్‌ను నివారిస్తుందా? శరీరానికి అవసరమైన హైడ్రేషన్‌ను అందిస్తుందా? అనే విషయాలపై చెరకు రసం గురించి కొన్ని అపోహలు ఉన్నాయి. వాటిని వైద్యులు వివరిస్తున్నారు. హైడ్రేషన్ జరుగుతుందా..హీట్ స్ట్రోక్ అనేది శరీరం తన ఉష్ణోగ్రతను నియంత్రించలేని ప్రమాదకర పరిస్థితి. ఇది ముఖ్యంగా డీహైడ్రేషన్, ఎలక్ట్రోలైట్ లోపం వల్ల వస్తుంది. చెరకు రసం తాగితే చల్లగా అనిపించినా, ఇది హీట్ స్ట్రోక్‌ను నివారించడానికి అవసరమైన ముఖ్య పోషకాలను అందించదు. చెరకు రసం ఎలక్ట్రోలైట్ డ్రింక్‌లా పనిచేస్తుందని ఒక పెద్ద అపోహ ఉంది. వాస్తవానికి చెమట ద్వారా శరీరం ఒక లీటర్‌కు సుమారు 900 మిల్లీగ్రాముల సోడియంను కోల్పోతుంది.

సోడియం శరీరంలో నీటిని నిల్వ ఉంచడంలో కీలకం. ఇది తక్కువగా ఉంటే హైడ్రేషన్ పూర్తిగా జరగదు. అందుకే చెరకు రసం తాగడం అంటే అసలు శరీరాన్ని హైడ్రేట్ చేయడం కాకుండా చక్కెర నీరు తాగినట్లే అవుతుందని నిపుణులు చెబుతున్నారు. దీనికంటే కొంచెం ఉప్పు కలిపిన నిమ్మరసం తాగడం ఎంతో మేలు చేస్తుంది.అధికంగా చక్కెర..ఇంకో ముఖ్య అంశం చక్కెర పరిమాణం. ఒక గ్లాస్ చెరకు రసంలో సుమారు 25 నుంచి 40 గ్రాముల వరకు చక్కెర ఉంటుంది. ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను ఒక్కసారిగా పెంచే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా ఖాళీ కడుపుతో తాగితే ఇది మరింత ప్రభావం చూపుతుంది. తాత్కాలికంగా శక్తి ఇచ్చినా, దీర్ఘకాలికంగా హైడ్రేషన్‌కు పెద్దగా సహాయపడదు. హైజీన్ కూడా చెరకు రసం విషయంలో పెద్ద సమస్యగా మారుతుంది. రోడ్డుపై అమ్మే జ్యూస్ స్టాళ్లు ఎక్కువసేపు ఎండలో ఉంటాయి. వాడే ఐస్ కూడా శుద్ధి చేసిన నీటితో తయారై ఉండదు. ఈ కారణాల వల్ల ఈ.కోలి, టైఫాయిడ్, జాండిస్ వంటి ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది.ఉప్పు, నిమ్మరసం కలిపిన నీళ్లు బెటర్..అయితే వేసవిలో ఏం తాగాలి? అంటే.. నిపుణుల సూచన ప్రకారం సాదాసీదా నీరు అత్యుత్తమం.

14 రోజులపాటు రోజూ ఒక కోడిగుడ్డును తింటే శరీరంలో కనిపించే మార్పులు ఇవే..!



గుడ్లు రోజువారీ ఆహారంలో అత్యంత సాధారణంగా ఉపయోగించే పదార్థాల్లో ఒకటి. వీటిని తేలికగా వండుకోవచ్చు, ఎన్నో వంటకాలతో కలిపి తినవచ్చు, ముఖ్యంగా ప్రోటీన్ కోసం చాలా మంది గుడ్లపై ఆధారపడుతుంటారు. కొందరికి ఇవి ప్రతి రోజు బ్రేక్‌ఫాస్ట్‌లో తప్పనిసరి కాగా, మరికొందరికి కొలెస్ట్రాల్ గురించి సందేహాలు ఉంటాయి. అయితే గుడ్లు కేవలం సులభమైన ఆహారమే కాదు, ఇవి శరీరానికి అవసరమైన అనేక పోషకాలను కలిగి ఉంటాయి. మెదడు పనితీరు, శక్తి స్థాయిలు, చర్మం, జుట్టు, కంటి ఆరోగ్యం వంటి అంశాల్లో కూడా గుడ్లు ముఖ్య పాత్ర పోషిస్తాయి. ఇక 14 రోజుల పాటు గుడ్లను ప్రతిరోజూ తింటే శరీరంలో కొన్ని మార్పులు కనిపిస్తాయని నిపుణులు తెలియజేస్తున్నారు.

మెదడు పనితీరుకు, కళ్ల ఆరోగ్యానికి..

మొదటగా మెదడు పనితీరు మెరుగుపడుతుంది. గుడ్లలో కోలిన్ అనే పోషకం అధికంగా ఉంటుంది. ఇది మెదడులో అసెటైల్కోలిన్ అనే న్యూరోట్రాన్స్‌మిటర్ తయారీలో సహాయపడుతుంది. ఇది జ్ఞాపకశక్తి, ఏకాగ్రతను మెరుగుపరచడంలో సహకరిస్తుంది. రెండవది, కొలెస్ట్రాల్ సమతుల్యం మెరుగుపడే అవకాశం ఉంటుంది. గుడ్లు కొలెస్ట్రాల్ పెంచుతాయని భావన ఉన్నప్పటికీ, చాలా మందిలో ఇవి హెచ్‌డీఎల్ (మంచి కొలెస్ట్రాల్) స్థాయిలని పెంచడంలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఇది గుండె ఆరోగ్యానికి ఉపయోగకరం. మూడవది, కంటి ఆరోగ్యానికి గుడ్లు మేలు చేస్తాయి. గుడ్ల పచ్చసొనలో లుటీన్, జియాజాంతిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి హానికరమైన బ్లూ లైట్ నుంచి కళ్లను రక్షించడంలో సహాయపడతాయి. దీర్ఘకాలికంగా కంటి ఆరోగ్యాన్ని కాపాడుతాయి.

జుట్టు, చర్మం సంరక్షణకు..

నాలుగవది, జుట్టు, చర్మం, గోర్లు ఆరోగ్యంగా ఉండటానికి గుడ్లు సహాయపడతాయి. గుడ్లలో సల్ఫర్ కలిగిన అమినో ఆమ్లాలు ఉంటాయి. ఇవి కెరాటిన్ అనే ప్రోటీన్ తయారీలో కీలక పాత్ర పోషిస్తాయి. దీంతో జుట్టు బలంగా, చర్మం ఆరోగ్యంగా, గోర్లు దృఢంగా మారుతాయి. ఇలా 14 రోజుల పాటు గుడ్లు తీసుకోవడం వల్ల శరీరంలో అనేక మంచి మార్పులు జరుగుతాయి. ఇక గుడ్లు తినని వారు కూడా ప్రత్యామ్నాయంగా కొన్ని ఆహారాలను తీసుకోవచ్చు. వెజిటేరియన్ల కోసం సోయా ఆధారిత ఆహారాలు మంచి ఎంపిక అని నిపుణులు సూచిస్తున్నారు.

పేగుల్లో మంచి బ్యాక్టీరియా: కేవలం జీర్ణక్రియకే కాదు.. ఈ ఆరోగ్య ప్రయోజనాల కోసం కూడా తప్పనిసరి!



పేగుల్లో మంచి బ్యాక్టీరియా కేవలం జీర్ణ వ్యవస్థకే కాదు, వీటికి కూడా అవసరమే..! ఇప్పటికే చాలా మందికి ప్రోటీన్ తీసుకోవడం, స్ట్రెంగ్త్ ట్రైనింగ్, ఎక్కువ కాలరీలు తీసుకోవడం కండరాల పెరుగుదలకు ముఖ్యమని తెలుసు. అయితే, ఇటీవల జరిగిన ఒక అధ్యయనం కండరాల శక్తి, శారీరక పనితీరును ప్రభావితం చేసే మరో ముఖ్య అంశాన్ని గుర్తించింది. పేగుల్లో మంచి బ్యాక్టీరియా కేవలం జీర్ణ వ్యవస్థకే కాదు, వీటికి కూడా అవసరమే..!ఇప్పటికే చాలా మందికి ప్రోటీన్ తీసుకోవడం, స్ట్రెంగ్త్ ట్రైనింగ్, ఎక్కువ కాలరీలు తీసుకోవడం కండరాల పెరుగుదలకు ముఖ్యమని తెలుసు. అయితే, ఇటీవల జరిగిన ఒక అధ్యయనం కండరాల శక్తి, శారీరక పనితీరును ప్రభావితం చేసే మరో ముఖ్య అంశాన్ని గుర్తించింది. పేగుల్లో ఉండే ఒక ప్రత్యేకమైన మంచి బ్యాక్టీరియా కండరాల బలం పెంచడంలో నేరుగా సహాయపడుతుందని ఈ పరిశోధన వెల్లడించింది. ఇది గట్-మసిల్ యాక్సిస్ అనే కొత్త భావనకు బలమైన ఆధారాలను అందిస్తోంది. అంటే పేగులలోని సూక్ష్మజీవుల వాతావరణం కండరాల పనితీరును ప్రభావితం చేస్తుంది. గట్-మసిల్ యాక్సిస్ అనేది జీర్ణవ్యవస్థ (గాస్ట్రోఇంటెస్టినల్ ట్రాక్ట్), కండరాల మధ్య ఉండే ద్విముఖ సంబంధం. పేగుల ఆరోగ్యం కండరాల పరిమాణం, పనితీరును ప్రభావితం చేస్తుంది. అదే సమయంలో శారీరక వ్యాయామం కూడా పేగులలోని మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందేందుకు దోహదపడుతుంది.గట్ అనే జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం ప్రకారం రోసిబ్యూరియా ఇనులినివోరాన్స్ అనే మంచి బ్యాక్టీరియా కండరాల పనితీరుకు సహజ బూస్టర్‌లా పనిచేస్తుందని వెల్లడైంది. ఇది కేవలం ఆహారాన్ని జీర్ణం చేయడమే కాకుండా, కండరాలు నిర్మాణం అయ్యేందుకు, సమర్థవంతంగా పనిచేయడానికి సంకేతాలు పంపుతుంది. ఇక ఈ పరిశోధనల్లో కొన్ని ముఖ్యాంశాలను కూడా పరిశోధకులు గుర్తించారు.

వృద్ధుల్లో ఈ బ్యాక్టీరియా ఎక్కువగా ఉన్నవారికి హ్యాండ్‌గ్రిప్ శక్తి దాదాపు 30 శాతం ఎక్కువగా కనిపించిందని గుర్తించారు. యువతలో ఈ బ్యాక్టీరియా శక్తి మాత్రమే కాకుండా స్టామినా పెరుగుదలతో కూడా సంబంధం కలిగి ఉంది. ఎలుకలపై చేసిన పరీక్షల్లో

ఈ బ్యాక్టీరియా ఇచ్చిన గ్రూప్‌లో గ్రిప్ శక్తి 30 శాతం పెరిగింది. మనుషుల్లో కూడా ఈ బ్యాక్టీరియా అధికంగా ఉన్నవారికి లెగ్ ప్రెస్, బెంచ్ ప్రెస్ వంటి వ్యాయామాల్లో మెరుగైన ఫలితాలు కనిపించాయి. కండరాలకు శక్తిని ఇస్తుంది..ఇక ఈ బ్యాక్టీరియా శరీరంలో అమినో ఆమ్లాల వినియోగాన్ని మార్చుతుంది. ఇది కండరాలకు అవసరమైన శక్తి మార్గాలను యాక్టివేట్ చేసి, కండర కణాలు అధిక శక్తిని ఉత్పత్తి చేసుకునేలాసహాయప డుతుంది. సాధారణంగా చెప్పాలంటే ఇది కండరాలకు ఇంధనం అందించే విధానాన్ని మెరుగుపరుస్తుంది.

ముఖంపై వాపుతో ఇబ్బంది పడుతున్నారా? కారణాలు మరియు నివారణ మార్పులు ఇవే!



ఇంటర్నెట్‌లో ప్రస్తుతం రిలాక్సింగ్ ఫేస్ మసాజ్ వీడియోలు విపరీతంగా వైరల్ అవుతున్నాయి. అలాగే ముఖంలో వచ్చే ఇన్‌ఫ్లమేషన్ (వాపు) తగ్గిస్తాయని చెప్పే హెర్బల్ షాట్స్ కూడా చాలామంది ఉపయోగిస్తున్నారు. ఇన్‌ఫ్లమేషన్ అనేది శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ గాయాలు లేదా ఇన్‌ఫెక్షన్లకు ప్రతిస్పందనగా వచ్చే సహజ ప్రక్రియ. అయితే ఇది ఎక్కువకాలం కొనసాగితే హృదయ రోగాలు, మధుమేహం, ఆటో ఇమ్యూన్ వ్యాధులు, క్యాన్సర్ వంటి తీవ్రమైన సమస్యలకు దారితీసే అవకాశం ఉంటుంది. అదే విధంగా ముఖంపై వచ్చే ఇన్‌ఫ్లమేషన్ వల్ల ఎర్రబడటం, వాపు, పఫ్‌నెస్ వంటి లక్షణాలు కనిపించి రూపాన్ని ప్రభావితం చేస్తాయి. ముఖంపై ఇన్‌ఫ్లమేషన్ ఎక్కువకాలం కొనసాగితే ఇన్‌ఫ్లమేజింగ్ అనే పరిస్థితి ఏర్పడుతుంది. దీని వల్ల కొల్లాజెన్, ఎలాస్టిన్ వంటి ముఖ్యమైన ప్రోటీన్లు దెబ్బతిని చర్మం ముందుగానే ముడతలు పడటం, వదులుగా మారటం, చర్మ రంగు అసమానంగా మారటం జరుగుతుంది.

ఆసక్తికర 'మిస్సింగ్ మేఘన'



మర్డర్ మిస్టరీ థ్రిల్లర్ సినిమాలను ఇష్టపడే సినీ ప్రియుల కోసం మరో ఆసక్తికరమైన చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. వాచ్చాస్పతీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న లేటెస్ట్ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ 'మిస్సింగ్ మేఘన'. రామ్ కార్తిక్, వైదికా సెంజాలియా, అంకిత్ కొయ్యా, అమ్ము అభిరామి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని ఫస్ట్ కాపీ మూవీస్, కేడి కంపెనీ బ్యానర్స్‌పై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీని సెప్టెంబర్ 18న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి సర్వం సిద్ధం చేశారు. ఇక విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో మేకర్స్ ప్రమోషన్ల వేగాన్ని పెంచారు. ఈ నేపథ్యంలో.. సినిమాపై మరిన్ని అంచనాలు పెంచేలా చిత్రబృందం ఒక బిగ్ అప్డేట్‌ను ప్రకటించింది. 'మిస్సింగ్ మేఘన' అధికారిక ట్రైలర్‌ను ఉదయం 11:34 గంటలకు విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఈ ట్రైలర్ అప్డేట్ సందర్భంగా విడుదల చేసిన కొత్త పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇందులో నటి అమ్ము అభిరామి చేతిలో టార్చ్ లైట్ పట్టుకుని ఎంతో షాకింగ్‌గా చూస్తుండటం కనిపిస్తుంది. ఆమె వెనుక ఉన్న బోర్డ్‌పై కొంతమంది వ్యక్తుల ఫొటోలు, పాత న్యూస్ పేపర్ క్లిప్పింగ్స్ ఉండటంతో సినిమా కథపై ప్రేక్షకుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

ఆకట్టుకుంటున్న 'ఇడుపు కాయితం' వీడియో



ప్రియదర్శి హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ఇడుపు కాయితం'. ఈ సినిమాలో తెలంగాణ ఫోక్ సాంగ్స్ ద్వారా పేరు తెచ్చుకున్న నటి నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తోంది. తెలంగాణ ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ స్టోరీతో ఎంటర్ టైనింగ్ డ్రామాగా యువ దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి రూపొందిస్తున్నారు. ప్రొడ్యూసర్ బన్నీ వాస్, జీనియస్ డైరెక్టర్ సుకుమార్ తమ బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ పై నిర్మించారు. ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా నుంచి 'శ్రీలత..' సాంగ్ రిలీజ్ చేశారు మేకర్స్. 'శ్రీలత..' సాంగ్ లో హీరో ప్రియదర్శి, హీరోయిన్ నాగదుర్గ కెమిస్ట్రీ ఆకట్టుకుంటోంది.

అలాంటి పాత్రలు చేసి డబ్బు సంపాదించాల్సిన అవసరం నాకు లేదు...



నేచురల్ బ్యూటీగా టాలీవుడ్ ఇండస్ట్రీ ఫుల్ క్రేజ్ తెచ్చుకున్న సాయి పల్లవి.. ప్రస్తుతం తెలుగుతో పాటు బాలీవుడ్‌లో కూడా పలు ప్రాజెక్టులు చేస్తూ బిజీగా ఉంటుంది. ఇదిలా ఉంటే.. తాజా ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ హీరోయిన్ కిస్సింగ్ సీన్స్‌పై ఆసక్తికర కామెంట్స్ చేసింది. 'చాలా మంది డైరెక్టర్స్ నేను ముద్దు సన్నివేశాల్లో నటించనని తెలిసినా ఇప్పటికీ అడుగుతూనే ఉంటారు. ఒకవేళ నాకు ఒక భాగస్వామి (బాయ్ ఫ్రెండ్) ఉంటే అప్పుడు యాక్టింగ్ అయినా మరేది అయినా వేరే ఒకరిని ముద్దు పెట్టుకోవడం కరెక్ట్ కాదు కదా. ఒక మంచి జీవితాన్ని గడపడానికి స్త్రీకి లేదా పురుషుడికి కావాల్సింది సంతోషకరమైన కుటుంబం. ఒక కారు, ఒక ఇల్లు మాత్రమే. ఇప్పటికే అవన్నీ నా దగ్గర ఉన్నాయి. కేవలం మరో కారు కొనడం కోసం నేను వేరొకరిని ముద్దు పెట్టుకోవాల్సిన అవసరం లేదు. నాకున్న దానితో నేను సంతోషంగా ఉన్నాను. నటన కోసం నన్ను సినిమాలో తీసుకోవాలనుకుంటే తీసుకోండి, కానీ సన్నిహిత సన్నివేశాల కోసం అయితే వేరే వారిని ఎంపిక చేసుకోండి. నాకు అందులో ఎలాంటి అభ్యంతరం లేదు' అంటూ చెప్పుకొచ్చింది. ప్రజెంట్ సాయి పల్లవి కామెంట్స్ వైరల్ అవుతుండగా.. 'డబ్బు కంటే విలువలకు ప్రాధాన్యతనిచ్చే వారిని చూడటం చాలా అరుదు' అంటూ ప్రశంసిస్తున్నారు అభిమానులు.

చరిత్రతో కూడిన కథల్లో నటించడం సవాలుతో కూడుకున్నది



వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్న యంగ్ బ్యూటీ సయూ మంజ్రేకర్, ప్రస్తుతం టాలీవుడ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ సరసన పాన్ ఇండియా మూవీ 'ఇండియా హౌస్'లో హీరోయిన్‌గా నటిస్తున్నారు. మెగాస్టార్ రామ్ చరణ్, యూవీ క్రియేషన్స్, విక్రమ్ రెడ్డి సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అయితే ఈ మూవీ షూటింగ్ ప్రారంభమై రెండేళ్లు పూర్తి కావొస్తున్నప్పటికీ విడుదల తేదీని ఖరారు చేసుకోలేదు. ఇదిలా ఉంటే.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సయూ మంజ్రేకర్ ఈ సినిమా విశేషాలు పంచుకుంటూ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిజమైన చరిత్ర ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రాల్లో నటించడం ఎంతో గర్వంగా, వినమ్రంగా ఉంటుందని సయూ చెప్పారు. సాధారణ సినిమాల్లో అయితే మనకు నచ్చినట్లు నటించడానికి కొంత స్వేచ్ఛ ఉంటుందని, కానీ ఇలాంటి చారిత్రాత్మక కథల్లో మాత్రం బాధ్యత చాలా ఎక్కువగా ఉంటుందని తెలిపారు. 'ఇండియా హౌస్' సినిమా కేవలం పెద్ద పెద్ద సెట్స్, ఖరీదైన కాస్ట్యూమ్స్ కోసం మాత్రమే కాదని స్పష్టం చేశారు. ఈ చిత్రానికి అనలైన బలం అందులోని మానవీయ భావోద్వేగాలేనని అన్నారు. ఆ కాలంలోని మనుషుల మధ్య ఉండే అనుబంధాలు, వారి త్యాగాలు, కలల చుట్టూ ఈ కథ తిరుగుతుందని తెలిపారు. డైలాగ్స్, బాడీ లాంగ్వేజ్, దుస్తులు అన్నీ ఆ నాటి వాతావరణాన్ని కళ్లకు కట్టేలా ఉంటాయని చెప్పారు.

సినిమాలు కేవలం కాలక్షేపం కోసం మాత్రమే కాకుండా, మన గతాన్ని, చరిత్రను ప్రేక్షకులకు గుర్తు చేసేలా ఉండాలని సాయి తెలిపారు. ఈ అద్భుతమైన ప్రాజెక్ట్‌లో భాగం కావడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. చరిత్రతో కూడిన కథల్లో నటించడం సవాలుతో కూడుకున్నదని అన్నారు.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com